


Government of Telangana

Statement of Encumbrance on Property (EC)

Statement of Encumbrance on Agricultural land with Survey number 227/ఆ/1/1/1/1/1/1/1/1/3 in village of Bahadurpalle Mandal of Gandimaisamma Dundigal District Medchal-Malkajigiri .

| S. No. | Description of property (Survey number, Extent, PPB number) | Transaction date | Name of parties Executants (Ex)/ Claimant (CL) | Nature of Deed/ Transaction ID/ Original Survey No/ Original Extent/ Transacted extent/ Market Value | Tahsildar office/ Document Number/year |
|---|---|---|---|---|---|
| 1 | Pattadar Name :డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ Khata No : 60293 Survey No : 227/ఆ/1/1/1/1/1/1/1/1/3 Extent (Ac. Gts) : 34.0000 Passbook No : T06040050389 | | డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (Pattadar) డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (Applicant) | Converted to Nonagriculture land With transaction No. : 2400112907 Original survey No - 227/ఆ/1/1/1/1/1/1/1/1/2 Original Extent (Ac. Gts) - 34.0000 Transacted Extent (Ac. Gts) - 34.0000 Market Value - | Tahsildar & Jt. Sub Registrar Office Name – Gandimaisamma Dundigal |
| 2 | Pattadar Name :డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ Khata No : 60293 Survey No : 227/ఆ/1/1/1/1/1/1/1/1/2 Extent (Ac. Gts) : 34.0000 Passbook No : T06040050389 | 28/06/2023 | Houses/House Sites(Houses/House Sites) (EX) డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (CL) | Transacted through Passbook Data Correction With transaction No. : 2200127089 Original survey No - 227/ఆ/1/1/1/1/1/1/1/1 Original Extent (Ac. Gts) - 44.3000 Transacted Extent (Ac. Gts) - 34.0000 Market Value - | Tahsildar & Jt. Sub Registrar Office Name – Gandimaisamma Dundigal |
| 3 | Pattadar Name :Houses/House Sites Khata No : 30000101 Survey No : 227/ఆ/1/1/1/1/1/1/1/1 Extent (Ac. Gts) : 44.3000 Passbook No : | 28/06/2023 | Houses/House Sites(Houses/House Sites) (EX) డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (CL) | Transacted through Passbook Data Correction With transaction No. : 2200127084 Original survey No - 227/ఆ/1/1/1/1/1/1/1 Original Extent (Ac. Gts) - 76.3600 Transacted Extent (Ac. Gts) - 32.0600 Market Value - | Tahsildar & Jt. Sub Registrar Office Name – Gandimaisamma Dundigal |
| 4 | Pattadar Name :Houses/House Sites Khata No : 30000101 Survey No : 227/ఆ/1/1/1/1/1/1/1 Extent (Ac. Gts) : 76.3600 Passbook No : | 22/06/2023 | Houses/House Sites(Houses/House Sites) (EX) డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (CL) | Transacted through Passbook Data Correction With transaction No. : 2200127097 Original survey No - 227/ఆ/1/1/1/1/1/1 Original Extent (Ac. Gts) - 83.3600 Transacted Extent (Ac. Gts) - 7.0000 Market Value - | Tahsildar & Jt. Sub Registrar Office Name – Gandimaisamma Dundigal |

దుండిగల్ గండిమైసమ్మ తహశీల్దార్ ధరణి రిజిస్ట్రేషన్‌లు- 2023 జూన్ 28.. ఈసీ

**మాధవ్ పత్తి..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 25:** బహుదూర్‌పల్లి సర్వే నెం.227లో జరుగుతున్న అక్రమాలు రెవెన్యూ శాఖ, అధికారులు, రాజకీయ నాయకులు కలిసి భూకబ్జా కాంబినేషన్‌ను బయట పెడుతున్నాయి.. హైకోర్టు పరిధిలో ఉండగానే చట్టవిరుద్ధ రిజిస్ట్రేషన్లు కొనసాగటం, అధికారుల మౌనం, పలువురు అనుమానాలకు దారితీస్తుంది.. ఈ వ్యవహారం మొత్తంలో "తెలంగాణ సీసీఎల్ఏ కమిషనర్" కీలకంగా వ్యవహరించి చక్రం తిప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అక్రమార్కులకు అసలు ఆధారాలే లేవని నిరూపించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్.. 2022లో ధరణి తప్పుడు రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయడానికి వెనకడుగు ఎందుకు..?


# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

# ఆ ధరణి రిజిస్ట్రేషన్‌లే..!
# అక్రమార్కులకు ఆయుధమా..?

- కేసు హైకోర్టు పరిధిలో ఉండగానే, "22-ఎ" నిబంధనలకు తూట్లు..
- 227లో అక్రమ ధరణి రిజిస్ట్రేషన్‌లు.. రద్దు ప్రస్తావన లేదు..! ప్రయత్నం లేదు..?

- 2022-23లో అక్రమ రిజిస్ట్రేషన్‌లు..! ఆక్రమణ దారులకి వరంగా మారిందా..?
- రూ.40 వేలకోట్లు విలువైన ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేస్తారా..?
- బహుదూర్‌పల్లి సర్వే నెం.227 ప్రభుత్వ భూమిలో "ఖరీదైన కబ్జాదారులు"..!
- ధరణీ రిజిస్ట్రేషన్‌లు చేసిన..! రెవెన్యూ యంత్రాంగం మౌనం వెనుక ఆంతర్యం..?
- దాదాపు 25 ఏళ్లుగా హైకోర్టు పరిధిలో ఉన్న భూమిలో నిరభ్యంతర రిజిస్ట్రేషన్‌లు..!
- 22-ఎ నిషేధిత జాబితా ఉల్లంఘనలో 'ఇద్దరు కలెక్టర్‌లు-ఇద్దరు తహసీల్దార్‌లు'..!
- మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్‌లపై 'కలెక్టర్-తహశీల్దార్' మౌనం ఉద్దేశం..?
- మంత్రులు--ఎమ్మెల్యేల పలుకుబడి రెవెన్యూ శాఖ చేతులు కట్టిపడేశాయా..?
- అక్రమ షెడ్డుకు నోటీసులు ఇచ్చి ఏడాదిన్నర గడిచినా చర్యలు శూన్యం..!
- ప్రభుత్వ భూమిలోనే సీసీ రోడ్డు నిర్మాణానికి కూడా రూ.60 లక్షలు ప్రభుత్వ నిధులే..!
- మేడ్చల్ జిల్లాలో ఏం జరుగుతోంది..? భూ కబ్జాలకు రెవెన్యూ యంత్రాంగం సపోర్ట్..?

-4లో



Government of Telangana

Statement of Encumbrance on Property (EC)

Statement of Encumbrance on Agricultural land with Survey number 227/ఆ/1/1/1/1/1/1/3 in village of Bahadurpalle Mandal of Gandimaisamma Dundigal District Medchal-Malkajigiri .

| S. No. | Description of property (Survey number, Extent, PPB number) | Transaction date | Name of parties Executants (Ex)/ Claimant (CL) | Nature of Deed/ Transaction ID/ Original Survey No/ Original Extent/ Transacted extent/ Market Value | Tahsildar office/ Document Number/year |
|---|---|---|---|---|---|
| 1 | Pattadar Name :డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ Khata No : 60287 Survey No : 227/ఆ/1/1/1/1/1/1/3 Extent (Ac. Gts) : 7.0000 Passbook No : T06040050387 | | డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (Pattadar) డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (Applicant) | Converted to Nonagriculture land With transaction No. : 2400069837 Original survey No - 227/ఆ/1/1/1/1/1/1/2 Original Extent (Ac. Gts) - 7.0000 Transacted Extent (Ac. Gts) - 7.0000 Market Value - | Tahsildar & Jt. Sub Registrar Office Name – Gandimaisamma Dundigal |
| 2 | Pattadar Name :డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ Khata No : 60287 Survey No : 227/ఆ/1/1/1/1/1/1/2 Extent (Ac. Gts) : 7.0000 Passbook No : T06040050387 | 22/06/2023 | Houses/House Sites(Houses/House Sites) (EX) డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (CL) | Transacted through Passbook Data Correction With transaction No. : 2200127097 Original survey No - 227/ఆ/1/1/1/1/1/1 Original Extent (Ac. Gts) - 83.3600 Transacted Extent (Ac. Gts) - 7.0000 Market Value - | Tahsildar & Jt. Sub Registrar Office Name – Gandimaisamma Dundigal |
| 3 | Pattadar Name :Houses/House Sites Khata No : 30000101 Survey No : 227/ఆ/1/1/1/1/1/1 Extent (Ac. Gts) : 83.3600 Passbook No : | 22/06/2023 | Houses/House Sites(Houses/House Sites) (EX) డాక్టర్ రేడ్డీస బియో సైన్సస్ లిమిటెడ్ (DR REDDYS BIO SCIENCES LIMITED) (CL) | Transacted through Passbook Data Correction With transaction No. : 2200127071 Original survey No - 227/ఆ/1/1/1/1/1 Original Extent (Ac. Gts) - 116.3500 Transacted Extent (Ac. Gts) - 32.3900 Market Value - | Tahsildar & Jt. Sub Registrar Office Name – Gandimaisamma Dundigal |
| 4 | Pattadar Name :Houses/House Sites Khata No : 30000101 Survey No : 227/ఆ/1/1/1/1/1 Extent (Ac. Gts) : 116.3500 Passbook No : | 21/04/2023 | Houses/House Sites(Houses/House Sites) (EX) సునీల్ గుప్త (SUNIL GUPTA) (CL) | Transacted through Passbook Data Correction With transaction No. : 2200144995 Original survey No - 227/ఆ/1/1/1/1 Original Extent (Ac. Gts) - 118.1000 Transacted Extent (Ac. Gts) - 1.1500 Market Value - | Tahsildar & Jt. Sub Registrar Office Name – Gandimaisamma Dundigal |

దుండిగల్ గండిమైసమ్మ తహశీల్దార్ ధరణి రిజిస్ట్రేషన్‌లు- 2023 జూన్ 22న..




## రాజకీయాలను పక్కనపెట్టి.. భట్టి విక్రమార్కతో కేటీఆర్ భేటీ

- సిరిసిల్ల నేతన్నల కోసం మల్లును కలిసిన కేటీఆర్
- రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలని విన్నపం
- పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలన్న కేటీఆర్
- సానుకూలంగా స్పందించిన మల్లు భట్టి విక్రమార్క

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రభుత్వ భూమిలో..!
# పలుకుబడి కబ్జాలు..?

అధికారపార్టీ నాయకుని అండతో..! కబ్జాదారుల 'ప్లాన్-బి' అమలు..

- దుండిగల్ సర్కిల్ పరిధి మల్లంపేట్‌లో ఈ అక్రమ నిర్మాణాలు..
- ఫోన్‌లు ఎత్తరు..! సమాధానం చెప్పరు..! వాళ్ళ రూటే సెపరేటు..!
- ప్రజలకు పనోళ్ళమనే సంగతే మరిచిన దుండిగల్ టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం..




- టిజి-బిపాస్ "చట్టాన్ని-చర్యలను" రెండు ట్రంకు పెట్టెలో..! ముడుపులు జేబులో..?
- చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు..?
- బాధ్యతలేని అధికారుల విధుల్లో..! పరాధీనం అవుతున్న సర్కారీ జమీన్..!

-5లో

# తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన

తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వార్తలు

ఆ ప్రచారంలో నిజం లేదన్న తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్

అవసరాలకు మించిన నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడి




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన నిల్వలు నిండుకున్నాయనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు కొన్ని చోట్ల బోర్డులు ఏర్పాటు చేశారు.

**అసోసియేషన్ వెల్లడించిన వాస్తవాలు:**

**సరిపడా నిల్వలు:** ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌పీసీఎల్ (HPCL), ఐఓసీఎల్ (IOCL), బీపీసీఎల్ (BPCL) వద్ద రాష్ట్ర అవసరాలకు మించి ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయి.


**రద్దీ వల్లే సమస్య:** ఇంధనం దొరకదనే భయంతో వాహనదారులు ఒక్కసారిగా బంకుల వద్దకు చేరుకోవడం, అందరూ 'ఫుల్ ట్యాంక్' చేయించుకోవడానికి మొగ్గు చూపడం వల్లే బంకుల్లో ఉన్న నిల్వలు త్వరగా ఖాళీ అవుతున్నాయి.

**తాత్కాలిక అంతరాయం:** బంకుల్లో స్టాక్ అయిపోయిన తర్వాత, డిపోల నుంచి మళ్ళీ ట్యాంకర్లు వచ్చి నింపడానికి కొంత సమయం పడుతుంది. ఈ గ్యాప్‌లో 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తుండటంతో ప్రజలు దానిని శాశ్వత కొరతగా భావిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో తెల్లవారుజాము నుంచే పెట్రోల్ బంకులు వాహనదారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆటోలు, కంటైనర్లు, కార్లు గంటల తరబడి క్యూలో ఉంటున్నాయి. "కొరత లేదు అని మొత్తుకుంటున్నా ఎవరూ వినడం లేదు, ముందస్తుగా నిల్వ ఉంచుకోవాలనే ఆత్రుత వల్లే ఈ కృత్రిమ రద్దీ ఏర్పడుతోంది" అని బంకుల యజమానులు వాపోతున్నారు.

# తప్పుడు ధరణి రిజిస్ట్రేషన్‌లే..! అక్రమార్కులకు ఆయుధమా..?



సర్వే నెం.227 ప్రభుత్వ భూమిలో.. సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డు నిర్మాణం..



GOVERNMENT OF TELANGANA
(REVENUE DEPARTMENT)

Office of the Tahsil,
Gandimaisamma-Dundigal Mandal.

Dated:07.05.2024.

No.B/528/2024

NOTICE UNDER SECTION 7 OF
A.P. LAND ENCROACHMENT ACT III OF 1905

To
Kum. Gaddam Sahiti Reddy D/o. G.Surender Reddy

Whereas you are reported to be un-authorized occupation of the land specified in the scheduled below, which is the property of Government. You are hereby given notice that if you desire so you may, before 2 days show cause either in person or in writing before me/the Collector why you should not addition to the full assessment on the land under section (3) (1) of the Act to the rate prescribed by or under section 3 (ii) of the act to charged a penalty for such occupation under section 5 of Act III of 1905 or and be subjected to eviction from the land and things deposited there on under section 6 of the said Act.

| Name of Village | Sy. No. and Sub-Division | Description of land | Total extent Ac-gts., | Encroached extent Ac-gts., | Nature of Occupation |
|---|---|---|---|---|---|
| Bahadurpally | 227 | Poramboke | 353-35 | 400 sq.yds (approx) | (01) Shed |

In view of the above the Girdawar of this office are directed to service and to return the served copy.

Tahsildar,
Gandimaisamma-Dundigal Mandal.

సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డుకు "07 మే 2024"న దుండిగల్ తహశీల్దార్ ఇచ్చిన నోటీసు..



227 ప్రభుత్వ భూమిలో.. ప్రభుత్వ నిధులతో రూ.60 లక్షలు కేటాయించి శిలాఫలకం..ఫైల్‌ఫోటో..

హైకోర్టు పరిధిలో ఉన్న భూములపై ఇంత సాహసోపేతంగా అక్రమ రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలు సాగుతుండటమే ఆశ్చర్యం.. అంతేకాదు, కబ్జాదారులకు ఎస్‌డిఎఫ్ పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ.60 లక్షలు కేటాయించడమే కాకుండా, సంబంధిత కలెక్టర్ ఆమోదం కూడా లభించిందని సమాచారం.. తహశీల్దార్ నుండి కలెక్టర్ వరకు ఎవరి అనుమతి లేకుండా ఇంత పెద్ద వ్యవహారం సాధ్యమా..? ప్రభుత్వ భూములపై కబ్జాలు, నిషేధిత జాబితా ఉల్లంఘనలు, అధికారుల సైలెన్స్ -- ఇవన్నీ కలిపి ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి.. చట్టం అందరికీ సమానమా..? లేక కబ్జాదారులకే రక్షణ కవచమా..?

-

3 పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం బహుదూర్‌పల్లి గ్రామ శివారు సర్వే నెం.227లో సుమారు రూ.40 వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూమి 353.35 ఎకరాలు.. అక్రమార్కులకు కట్టబెట్టేందుకు అంతర్గత చర్చలు ఏమైనా జరుగుతున్నాయా..? మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారుల తీరు "దూడను పాలు త్రాగమని -- గేదెను తన్నమని" అన్నట్టు ఉంది.. గత 25 సంవత్సరాలుగా హైకోర్టు ఆదేశాల మేరకు.. ఇప్పటికే మూడు సార్లు ప్రభుత్వ భూమిగా నిర్ధారించిన కలెక్టర్‌లు, '2022-2023'లో తప్పుడు ధరణి రిజిస్ట్రేషన్‌లు అధికారుల అవినీతిని బట్టబయలు చేస్తోందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.. చివరికి బహుదూర్‌పల్లి 227లో చట్టాలు ఉనికిని పోయాయా అనే అనుమానాలకు బలాన్ని ఇస్తుంది..! హైకోర్టులో ఉందన్న భయం, అటు అధికారుల్లోనూ -- ఇటు కబ్జాదారుల్లోనూ లేకపోవడం గమనార్హం.. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కేసుల నమోదు లేకపోవడంలో అర్థం..?

## చట్టం కళ్లముందే ఉల్లంఘనలు..!

హైకోర్టు ఆదేశాలు ఉన్నా, 22-ఎ నిబంధనలను మేడ్చల్ జిల్లా కలెక్టర్‌లు, దుండిగల్ గండిమైసమ్మ తహశీల్దార్‌లు బహిరంగంగా ధిక్కరించినా, ఇప్పటివరకు ఏ ఒక్క అధికారిపై కూడా చర్యల్లేవు.. రెవెన్యూ యంత్రాంగం ఒక్క క్రిమినల్ కేసు కూడా నమోదు చేయలేదు. అధికార యంత్రాంగం మౌనం ఈ వ్యవహారాన్ని మరింత అనుమానాస్పదంగా మార్చింది.. ప్రభుత్వ భూమిగా రికార్డులు, సెత్వార్ పహాణీలు చెబుతున్నా, 2025 నవంబర్ 4వ తేదీ వరకు కూడా మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఈసీలు చెబుతున్నాయి.. హైకోర్టు పరిధిలో ఉన్న భూమిపై క్రయవిక్రయాలు ఎలా జరుగుతున్నాయో అనేది పెద్ద ప్రశ్నగా మారింది. "అధికారులకు తెలియకుండా ఇది సాధ్యమా..?" అనే సందేహం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.. 'ఖరీదైన కబ్జాదారులు' అయినందున, అధికారులు కూడా మౌనం వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తాయి.. సర్వే నెం.227 ప్రభుత్వ భూమి ఆక్రమణ దారుల్లో పలువురు ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సన్నిహితులు ఉన్నారని సమాచారం. వారి ప్రభావం కారణంగానే రెవెన్యూ శాఖ అధికారులు కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి..

## సర్వే నెంబర్ 227 భూమి స్థితి..

1951-52 పహాణీల ప్రకారం సర్వే నెం. 227 భూమి "సర్కారి (ప్రభుత్వ) భూమి"గానే నమోదైందని అధికారిక రికార్డులు చెబుతున్నట్టు నివేదికలే చెబుతున్నాయి.. అదే పహాణీలో కాలం నెంబర్.9లో "పోరంబోకు" భూమిగా కూడా పేర్కొన్నారు.. మండల్ ఆఫీస్‌లో ఉన్న అసలు "సేత్వార్" రికార్డుల ప్రకారం కూడా ఈ భూమి ప్రభుత్వ భూమిగానే ఉన్నదని నిర్ధారణ అయింది.. మొత్తం విస్తీర్ణం 353.35 ఎకరాలుగా పేర్కొనబడింది.. ఈ భూమి "పట్టా భూమి"గా ఉన్నట్టు రికార్డులు ఎక్కడా లేవని స్పష్టతను ఇచ్చారు.. సర్వే నెం.227 లోని 353.35 ఎకరాలు పాత పహాణీ రికార్డుల ప్రకారం ప్రభుత్వ (పోరంబోకు) భూమిగా నిర్ధారణ అయ్యాయి జాగీర్ దారుల రద్దు తర్వాత ఆ భూమిపై ఎటువంటి ప్రైవేట్ హక్కులు లేవని ప్రభుత్వం, కోర్టుకు సమర్పించింది..

## జాగీర్ భూముల రద్దుతో.. ప్రభుత్వ భూమిగా..

కలెక్టర్ జాగిరత్ కార్యాలయం నుండి 1938లో జారీ చేసిన ఒక లేఖ నిజమైనదేనా అనే అంశంపై విచారణ జరిగింది.. 2009లో కమిషనర్ స్పష్టం చేశారు.. జాగీర్ వ్యవస్థ 1358 ఫస్లీ (1948) చట్టం ప్రకారం రద్దు అయ్యింది.. జాగీర్ భూములు పరిపాలనా పరంగా ప్రభుత్వానికి బదిలీ అయ్యాయి.. అందువల్ల పాత రికార్డులను ఇప్పుడు, ధృవీకరించడం సాధ్యం కాదని తెలిపారు.. మరోవైపు 227 భూమిని కొనుగోలు చేసిన వారకి ఇప్పటికీ మదర్ డాక్యుమెంట్లు లేవు.. 1965లో 227 ప్రభుత్వ భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేసిన నంబూరి కుటుంబానికి 227 భూమి ఎలా సంక్రమించిందో రుజువు చేయలేకపోయారని, కలెక్టర్ తీర్పులో నిర్ధారించారు.. అయినప్పటికీ 227 ప్రభుత్వ భూమి అక్రమార్కులకు ఆయుధంగా మారిన అంశం ఏమిటి..? 22-ఎ నిషేధిత జాబితాలో ఇళ్ళ ప్లాట్‌లుగా చూపిస్తున్న స్థలాన్ని..! 2022లో ఇద్దరు కలెక్టర్‌లు, ఇద్దరు తహశీల్దార్‌లు ఏ ఉద్దేశంతో ధరణి రిజిస్ట్రేషన్‌లు చేశారు..? ధరణి చట్టం సరైనది కాదని, భూ భారతి చట్టాన్ని అమలు చేసిన తెలంగాణ ప్రభుత్వం.. 227లో అక్రమంగా చేసిన తప్పుడు ధరణి రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయడానికి మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎందుకు వెనకడుగు వేస్తున్నారు..? రిజిస్ట్రేషన్‌ల వ్యవహారంలో, కలెక్టర్‌లు, సీసీఎల్ఏ కమిషనర్ ఉన్నందుకేనా..?

## సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డుకు నోటీసులిచ్చి ఏడాదిన్నర..!

బహుదూర్‌పల్లి సర్వే నెం.227 ప్రభుత్వ భూమిలో 400 గజాల్లో సురేందర్ రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా నిర్మించిన షెడ్డుకు.. దుండిగల్ తహశీల్దార్ మతీన్ హయాంలో 2024 మే 7న పది రోజుల వ్యవధితో నోటీసు జారీ చేశారు.. అయితే దాదాపు ఏడాదిన్నర గడిచినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అనేక అనుమానాలకు దారి తీస్తోంది.. అధికారులు ముడుపులు స్వీకరించినందునే నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డుపై చర్యలకు అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పలుమార్లు, ప్రస్తుత తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డిని కూల్చివేతలకు ఆదేశించినా బేఖాతర్ చేయడం గమనార్హం..

## పంచాయతీ రాజ్ నిధులతో సీసీరోడ్డు..!

ఇంకా ఆశ్చర్యకరమైన, హాస్యాస్పద విషయం ఏమిటంటే..! అదే 227 ప్రభుత్వ భూమిలో రూ.60 లక్షల ఎస్‌డిఎఫ్ పంచాయతీ రాజ్ నిధులను కేటాయించి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో, తహశీల్దార్ సీసీ రోడ్డు నిర్మాణానికి సహకరించినట్టు రికార్డులే చెబుతున్నాయి.. ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు జరుగుతుండగా, వాటికే ప్రభుత్వ నిధులు వెచ్చించడం చట్టపరంగా ఎంతవరకు సమంజసం అనేది ఉన్నతాధికారులు తేల్చాల్సిన అంశం..హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి, నిషేధిత జాబితాలో ఉన్న భూమిని రిజిస్టర్ చేయడం, అక్రమ నిర్మాణాలకు ప్రభుత్వ నిధులు వినియోగించడం, ఇవన్నీ చట్టపరంగా తీవ్ర ఉల్లంఘనలు.. కానీ చర్యలు మాత్రం శూన్యం. బహుదూర్‌పల్లి భూముల కబ్జా వ్యవహారాన్ని పరిశీలిస్తే "ఆలీబాబా అరడజను దొంగలు" కథ బట్టబయలు అయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు..



ప్రభుత్వ భూమిలో సీసీరోడ్డు నిర్మాణం.. ప్రభుత్వం వేసిందే.. ఫైల్‌ఫోటో..



కబ్జాదారులకు వేసిని అక్రమ సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే.. ఫైల్‌ఫోటో..

# రాజకీయాలను పక్కనపెట్టి.. భట్టి విక్రమార్కతో కేటీఆర్ భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న సంక్షోభం నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ తీసుకున్నారు. ఈరోజు సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఆయన, సిరిసిల్ల నియోజకవర్గంలోని పవర్ లూమ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ భేటీ అందరినీ ఆకట్టుకుంటోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న సుమారు రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలు, పేరుకుపోయిన బ్యాక్ బిల్లింగ్, సర్‌ఛార్జ్‌లను తక్షణమే మాఫీ చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న విధంగానే పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని, పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో నేతన్నలు మళ్ళీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని, వారికి తక్షణమే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ వివరించిన సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నేతన్నల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యుత్ బకాయిల అంశాన్ని లోతుగా పరిశీలించి కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.


# ప్రభుత్వ భూమిలో..! పలుకుబడి కబ్జాలు..!



## అధికారపార్టీ నాయకుని అండతో..! కబ్జాదారుల 'ప్లాన్-బి' అమలు..

- దుండిగల్ సర్కిల్ పరిధి మల్లంపేట్‌లో ఈ అక్రమ నిర్మాణాలు..
- ఫోన్‌లు ఎత్తరు..! సమాధానం చెప్పరు..! వాళ్ళ రూటే సెపరేటు..!
- ప్రజలకు పనోళ్ళమనే సంగతే మరిచిన దుండిగల్ టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం..

- టిజి-బిపాస్ "చట్టాన్ని- చర్యలను" రెండు ట్రంకు పెట్టెలో..! ముడుపులు జేబులో..?
- చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు..?
- బాధ్యతలేని అధికారుల విధుల్లో..! పరాధీనం అవుతున్న సర్కారీ జమీన్..!




కొత్తగా మరికొన్ని విల్లాలు నిరాటంకంగా పనులు..

- అటు మున్సిపల్ అనుమతుల్లేవు..! ఇటు రెవెన్యూ ఎన్‌వోసి లేదు..
- దాదాపు 8 డూప్లెక్స్ హౌస్ నిర్మాణాలు దర్జాగా ప్రారంభం..!
- మల్లంపేట్ సర్వే నెం.170/3లో ప్రభుత్వ భూమి ఆక్రమణతో నిర్మాణాలు..
- బెల్లం కొట్టిన రాయిలా పడున్న "రెవెన్యూ- మున్సిపల్" అధికారులు..
- చైన్‌మెన్ నుండి డిసి- ఏసిపి-టిపిఎస్.. ఇష్టానుసారంగా విధుల నిర్వహణ..
- మల్లంపేట్ సర్వే నెం.170/3, 170/4, 170/5 పేరిట అసైన్డ్ భూమిలో కబ్జాలు..
- విజయలక్ష్మి కొన్నదెంత 14-20 ఎకరాలు.. ఆక్రమణలో 19-10 ఎకరాలు..?
- కబ్జాకు గురైన భూమిని స్వాధీన పరచు కోకుండా చోద్యం చూస్తున్న రెవెన్యూ..
- అక్రమ నిర్మాణాలపై ప్రశ్నిస్తే పర్మిషన్‌లు ఉన్నాయని బుకాయించే కరెప్షన్ అధికారి..?
- అధికారపార్టీ నేత సోదరుని కుమారుడు, మరో బిల్డర్ కలిసి ఈ అక్రమ కట్టడాలు..
- ప్రజల సొమ్మును జీతాలు తీసుకుంటున్న, అధికారులు ప్రభుత్వ ఆస్తులు ధారాదత్తం..
- నాడు బీఆర్ఎస్ నాయకుల సహకారం.. నేడు కాంగ్రెస్ నేతలతో సిఫార్సులు..?

మల్లంపేట్ సర్వే నెంబర్ 170/3, 170/4, 170/5 గుర్రం విజయలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ అక్రమ వెంచర్‌గా ఆనాడే తేల్చారు 2021 నుండి అధికారుల చర్యలు నాటకీయ పరిణామాల నడుమ కొట్టుమిట్టాడుతోంది..! కలెక్టర్ ఎస్.హరీష్ ఆదేశాలతో డిపిఓతో జరిపించిన విచారణలో షాకింగ్ నిజాలు బయట పడ్డాయి.. అనుమతులు 60.. అక్రమ నిర్మాణాలు 260, ఈ వ్యవహారంలో అప్పట్లో కేసునమోదుకు దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌ను మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశించారు.. దీంతో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ ఎస్‌హెచ్‌ఓ ఫిర్యాదు లేఖను సమర్పించారు.. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ 'బిల్డర్ విజయలక్ష్మి' ఇతర దేశాలలో ఉండటం తోపాటు, కరోనా సమయం కావడం, అరెస్ట్ ప్రక్రియకు కొంత జాప్యం జరిగింది.. ఆతర్వాత "2022 అక్టోబర్ 3న" నకిలీ అనుమతులతో 208 భవనాలు, నిర్మించారని గుర్తించి దుండిగల్ మున్సిపల్ కమిషనర్ 208 విల్లాలు నిషేధిత జాబితాలో పెడుతూ, సంబంధిత శాఖలకు వసతులు కల్పించకూడదని, జారీ చేసిన నోటీసులు ఏమయ్యాయి.. జాలి చూపించారా..? ఉదాసీనతతో వ్యవహరించారా..? అక్రమ నిర్మాణాలు సక్రమం ఎలా అయ్యాయి..? "నలుగురు కమిషనర్‌లు- నలుగురు టౌన్‌ప్లానింగ్ అధికారుల"పై విజిలెన్స్ విచారణ కూడా ఉత్తుత్తిదేనా..? అప్పటి బాగోతానికి అధికారుల అవినీతి బట్టబయలు కాగా..! ఇప్పుడు కొత్తగా మరో బాగోతాన్ని రక్తి కట్టిస్తున్నారు.. ప్రస్తుతం నిర్మిస్తున్న ఎనిమిది విల్లాల నిర్మాణం వెనుక ఓ అధికారపార్టీ నేత పెత్తనం చెలాయిస్తున్నాడని అనధికారిక సమాచారం.. ఆయన గారి మెప్పు పొందేందుకు, దుండిగల్ సర్కిల్ అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి..


**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 25:**

మల్లంపేట్ సర్వే నెం.170/3 అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు..





మల్లంపేట్ సర్వే నెం.170/3 అసైన్డ్ భూమిలో ఖరీదైన డూప్లెక్స్ నిర్మాణాలు..

దుండిగల్ సర్కిల్-59 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో.. అక్రమ నిర్మాణాల వ్యవహారం అదోలా తయారైంది.. "ఇందు కలవు అక్రమ నిర్మాణాలు, అందు లేవని సందేహము వలదు.. ఎందెందు వెతికినా, ఏ సందులో చూసినా అందందు అక్రమ కట్టడాలు అనేకం.. అన్న చందంగా తయారైంది..! ఈ తరహా పద్యభాగం పురాణంలో హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడు శ్రీమహావిష్ణువు గురించి చెప్పిన సందర్భాన్ని, దుండిగల్ సర్కిల్-59 లోనూ అక్రమ నిర్మాణాల పర్వం ఉందని టౌన్‌ప్లానింగ్ అధికారులకు అర్థమయ్యే రీతిలో సంబోధించడమైనది.. బాధ్యతాయుతమైన విధుల్లో ఉన్న మున్సిపల్ అధికారులు బాధ్యతా రహితంగా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది.. జవాబుదారీగా ఉండాల్సిన టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం, కొత్తగా నియమించిన "చైన్‌మెన్ నుండి, టిపిఎస్-ఏసిపి, డిప్యూటీ కమిషనర్" వరకు ఫోన్‌లు ఎత్తరు, సమాధానం చెప్పరు.. అక్రమ నిర్మాణాల నియంత్రణకు బిల్ కలెక్టర్ లుగా,ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని, 6 గురిని చైన్‌మెన్‌లుగా, గ్రామానికి ఒక్కరి చొప్పున నియమించి నప్పటికీ..! టౌన్‌ప్లానింగ్ విభాగంపై అవగాహన లేదని స్పష్టమవుతుంది.. చివరికి ఈ నూతన చైన్‌మెన్‌లు సైతం ఏసిపి, టిపిఎస్, డిప్యూటీ కమిషనర్ అడుగు జాడల్లోనే నడుస్తున్నారు.. ఫోన్‌లు చేసినా, వార్తలు వచ్చినా దున్నపోతు మీద వర్షం పడిన చందంగా, స్పందించరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. బహుదూర్‌పల్లిలో భారీ అక్రమ షెడ్లు- మల్లంపేట్‌లో అనేక అక్రమ నిర్మాణాలు.. బౌరంపేట్‌లో పలు అక్రమ షెడ్లు.. 3 నెలలుగా వార్తలు వచ్చినా..! వసూళ్ళకు అలవాటు పడిన అధికారులు, బరితెగించి అక్రమ కట్టడాలను ప్రోత్సహించడంపై, టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ మాఫియాగా తయారైందని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి..



మల్లంపేట్ అక్రమ విల్లాలపై స్థానికుల ఫిర్యాదు..



ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు..


## ప్రభుత్వ భూమిలో 8 అక్రమ విల్లాల నిర్మాణమా..?

దుండిగల్ సర్కిల్ 'సిఎంసి' పరిధి మల్లంపేట్ సర్వే నెం.170/3, 170/4, 170/5లోని అసైన్డ్ భూమిని, మాజి సైనికులకు కేటాయించిన సుమారు 15 ఎకరాలు గుర్రం విజయలక్ష్మి కొనుగోలు చేసినట్టు అధికారులు చెబుతుండగా.. 2021 నుండి ఇప్పటి వరకు "అక్రమమో- సక్రమమో" నిర్మాణాలు మాత్రం పూర్తి అయినప్పటికీ.. కొనుగోలు చేసిన 15 ఎకరాల పేరుతో సుమారు 5-6 ఎకరాలు అసైన్డ్ భూమిని అదనంగా ఆక్రమించినట్టు స్థానికుల సర్వేలో బయటపడింది.. దీంతో దుండిగల్ తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్ళి సర్వే నిర్వహించి, అదనంగా కబ్జాకు గురైన భూమిని స్వాధీన పరచుకోవాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు.. కారణం కబ్జాదారుల సిఫార్సులు, అధికారుల చేతివాటం అట్లాంటిదని ఎగతాళి చేసేవారు లేకపోలేదు.. బిల్డర్ గుర్రం విజయలక్ష్మి అప్పటికే సంబంధిత అసైన్డ్ భూమిని, తమ సమీప బంధులు, స్నేహితుల పేరుమీద కబ్జా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఏడాది క్రితం అరెస్ట్ అయిన విజయలక్ష్మి,'ప్లాన్-బి' అమలు చేసింది.. ఇతరులపై తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేసిన అసైన్డ్ భూమిలో ఎలాంటి లేఅవుట్, అనుమతులు తీసుకోకుండానే ఇప్పుడు 8 విల్లాల నిర్మాణం చేపట్టడం వివాదాస్పదంగా మారింది..




మల్లంపేట్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్‌లో.. 2021 డిసెంబర్లో మున్సిపల్ అధికారులు సీజ్ చేసిన.. ఫైల్‌ఫొటో..


మల్లంపేట్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ అక్రమ నిర్మాణాల వ్యవహారం దుండిగల్ రెవెన్యూ కావలికారు నుండి కలెక్టర్ వరకు తెలిసిందే.. అటు మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకూ ఈ బాగోతం చూసిన వారే..! అయినప్పటికీ, ఎటొచ్చి ఫిర్యాదు చేసేవాళ్ళు, పత్రికల్లో వార్తలు రాసేవాళ్ళే ఇప్పుడు అధికారులు, అక్రమార్కులకు టార్గెట్.. భూ పరిరక్షణకు నియమించిన రెవెన్యూ అధికారులకు ఈకబ్జా తతంగం తెలియకుండా సాధ్యమేనా..? కలెక్టర్ ఆదేశాలతో స్వయంగా దుండిగల్ మున్సిపల్ కమిషనర్ (అప్పుడు బోగీశ్వర్లు) 2021 డిసెంబర్ 3న దుండిగల్ పోలీసులకి కేసునమోదుకు ఫిర్యాదు చేశారు.. ఆతర్వాత 2022 అక్టోబర్ 3న 208 విల్లాలు నిషేధిత జాబితాలో చేర్చుతూ సౌకర్యాలు కల్పించకుండా, సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసినప్పటికీ, కమిషనర్‌కి తెలియకుండా నిర్మాణాలు పూర్తి చేశారా..? ఈవిధంగా ప్రజలను జోకర్లను చేస్తూ.. ఇష్టానుసారంగా అక్రమార్కులకు సహకరించే అవినీతి అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు..



260 అక్రమ విల్లాలు గుర్తించి చర్యలకు ఆదేశించిన కలెక్టర్ ఆర్డర్



2021 డిసెంబర్ 3న బిల్డర్ విజయలక్ష్మిపై కేసునమోదుకు ఫిర్యాదు..



2022 అక్టోబర్ 3న 208 విల్లాలు నిషేధిత జాబితాలో పెట్టిన మున్సిపల్ నోటీసులు..

## ఏడాది క్రితం రోడ్ నెంబర్-1లో..! ఇప్పుడు రోడ్ నెంబర్-10లో..!

బిల్డర్ ఎన్‌ఆర్ఐ గుర్రం విజయలక్ష్మి తమ బినామీలకు అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసిన అసైన్డ్ భూమిని రోడ్ నెంబర్-1 లో ఏడాది క్రితం ఇదే తరహాలో అక్రమ నిర్మాణాలు చేపడుతుండగా.. స్థానికుల ఫిర్యాదుతో పలు పత్రికల్లో వార్తా కథనాలు వచ్చాయి.. దీంతో అప్పటి తహశీల్దార్ సర్వే చేయించి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు నాటారు.. ఓసారి బోర్డును కూడా కబ్జాదారులు తొలగించడంతో, కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ హెచ్చరించి మళ్ళీ బోర్డును ఏర్పాటు చేశారు.. అక్కడ దుకాణం మూసేసిన అక్రమార్కులు.. రోడ్ నెంబర్-10 లోని అసైన్డ్ భూమిలో, 8 విల్లాలకు "రెవెన్యూ- మున్సిపల్" అడ్డు పడకుండా, ఓ అధికారపార్టీ నేతతో పెద్ద మొత్తంలో ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ డూప్లెక్స్ నిర్మాణాలు అధికారపార్టీ నాయకుని సోదరుని కుమారుడి తోపాటు, మల్లంపేట్‌లో ఓ బడాబిల్డర్ రంగంలోకి దిగినట్టు సమాచారం.. ఈ వ్యవహారంలో దుండిగల్ రెవెన్యూ- దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల సహకారం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి..

# నేటి తరానికి ఆదర్శం ధర్మబిక్షం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయన స్వాతంత్ర్య సమరయోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం. బొమ్మగాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళు కొనుగోలు లాంటి కార్యక్రమా లలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచు కున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి,కమ్యూనిస్టు పార్టీతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి,ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు.తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మభిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చు కున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. 1951-73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952-57, 1957-62, 1962-67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991-96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా. 1992-95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని,

భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మబిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు.

# తెలంగాణ సెమాగ్లుటైడ్ బ్యాన్

**హైదరాబాద్, మార్చి 25, పెన్ పవర్:**
బరువు తగ్గడం కోసం, మధుమేహ నియంత్రణ కోసం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందుతున్న సెమాగ్లుటైడ్ మెడిసిన్ వాడకంపై తెలంగాణ రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా, సొంత నిర్ణయాలతో ఈ మందులను వాడటం వల్ల ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల ఈ ఔషధాలకు సంబంధించిన పేటెంట్ గడువు ముగియడంతో మార్కెట్‌లోకి అనేక రకాల కొత్త ఫార్ములేషన్లు అందుబాటులోకి వస్తున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కోరింది. సెమాగ్లుటైడ్ అనేది గ్లూకాగాన్-లైక్ పెప్టైడ్-1 రిసెప్టర్ అగోనిస్ట్ అనే తరగతికి చెందిన ఔషధం. ఇది శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతోపాటు, ఆకలిని తగ్గించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా టైప్ -2 డయాబెటిస్ బాధితులకు ఇది ఒక వరప్రసాదంగా మారింది. అయితే ఇటీవల కాలంలో కేవలం బరువు తగ్గడం కోసమే దీనిని వాడే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. గత వారమే ఈ ఔషధాల అసలు ఆవిష్కర్త పేటెంట్ గడువు ముగిసింది. దీని వల్ల వివిధ కంపెనీలు మల్టీ డోస్ వయల్స్, ప్రీ- ఫీల్డ్ పెన్స్ రూపంలో సెమాగ్లుటైడ్ ఫార్ములేషన్లు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న ఈ మందులపై ప్రజలకు అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ విక్రయాలు జరిగే అవకాశం ఉందని ఐజూూ గుర్తించింది. తెలంగాణ డీసీఏ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సెమాగ్లుటైడ్ కేవలం రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్ల పర్యవేక్షణలో వాడాలి. ఎండోక్రినాలజిస్టులు, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్టులు మాత్రమే ఈ మందులను ప్రిస్క్రైబ్ చేయాలి. గుండె సంబంధిత సమస్యలు ఉండి, ఆమోదించే సంకేతాలు ఉన్న సందర్భాల్లో మాత్రమే కార్డియాలజిస్టులు దీనిని సూచించవచ్చు. రోగికి ఈ మందును సూచించే ముందు వారి ఆరోగ్య చరిత్ర, ఇప్పటికే ఉన్న ఇతర వ్యాధులు, ఎదురయ్యే ముప్పును వైద్యులు నిశితంగా పరిశీలించారు. సరైన మోతాదు, ఎంత కాలం వాడాలి అనే విషయాలను నిపుణులైన డాక్టర్లు మాత్రమే నిర్ణయించాల్సి ఉంటుంది.

**అజాగ్రత్తా వాడితే పొంచి ఉన్న సమస్యలు**

సరైన వైద్య పర్యవేక్షణ లేని పక్షంలో సెమాగ్లుటైడ్ వాడకం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని డీసీఏ హెచ్చరించింది. అక్యూట్ ప్యాంక్రియాటైటిస్ అంటే క్లోమగ్రంథి వాస్తుంది. మూత్రపిండాలు ఒక్కసారిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. విపరీతమైన కడుపు నొప్పి, వాంతులు, ఇతర తీవ్రమైన ప్రతి చర్యలు ఉంటాయి. గాల్ బ్లాడర్‌లో రాళ్లు రావడం, ఇతర సమస్యలు రావచ్చు. ప్రజలు సెమాగ్లుటైడ్ మెడిసిన్‌ను కేవలం లైసెన్స్ ఉన్న మెడికల్ షాపులో నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, అనధికారక విక్రేతల వద్ద, ఇతర చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా వీటిని ఆర్డర్ చేయొద్దు. ఇలాంటి మార్గాల్లో లభించే మందులు నకిలీవి, నాణ్యత లేనివి, హాని చేసేవి అయ్యి ఉంటాయని హెచ్చరించింది.

**తయారీదారులకు హెచ్చరిక**

మందుల తయారీ కంపెనీలకు కూడా ప్రభుత్వం కఠిన ఆదేశాలు జారీ చేసింది. సెమాగ్లుటైడ్ వాడకాన్ని ప్రోత్సహించేలా ఎటువంటి పరోక్ష ప్రకటనలు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా లేదా అన్ అప్రూవ్డ్ వాడకాన్ని ప్రోత్సహించేలా ప్రమోషన్లు చేస్తే చర్యలు తప్పవని చెప్పింది. ఒక వేళ ఎక్కడైనా ఈ మందులను అక్రమంగా విక్రయిస్తున్నట్టు తెలిసినా, అనధికారికంగా ప్రచారం చేస్తున్నట్టు గమనించినా వెంటనే తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు ప్రజలను కోరారు.

# ఎడతెగని భద్రాద్రి పంచాయితీ

**ఖమ్మం, మార్చి 25, పెన్ పవర్:**
మనదేశంలో.. ముఖ్యంగా దక్షిణాది ప్రాంతంలో ఒక మనిషి పేరుకు ముందు ఇంటి పేరు ఉంటుంది. ఆ తర్వాత కులం.. అనంతరం గోత్రం ఉంటుంది.. ఇది ఇప్పటిది కాదు.. తరతరాలుగా సాగుతూ వస్తోంది. కులాన్ని.. గోత్రాన్ని కొంతమంది వ్యతిరేకించినప్పటికీ.. చాలామంది నేటికీ అనుసరిస్తూనే ఉంటారు..కులాలు.. గోత్రాలు కేవలం మనుషులకు మాత్రమే కాదు.. దేవతామూర్తులకు కూడా ఉంటాయి. దేవతామూర్తులకు కులాలను.. గోత్రాలను ఆపాదించడం ఈనాటిది కాదు.. దాని వెనక ఏళ్ల చరిత్ర ఉంది. ఆయా దేవుళ్లను వివిధ కులాలవారు ఆపాదించుకోవడం పరిపాటిగా మారింది.ఇప్పటివరకు కులాలు.. గోత్రాల విషయంలో ఏ దేవుళ్ళు కూడా ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. వివాదాస్పదమైన సందర్భాలు కూడా లేవు. అయితే తొలిసారిగా ఇటువంటి ఇబ్బందులు శ్రీ సీతారామ చంద్రుడు ఎదుర్కొంటున్నాడు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది ముమ్మాటికి నిజం. సీతారామ చంద్రుడికి ఆస్థాయిలో ఇబ్బంది ఎందుకు కలిగింది.. గోత్రం విషయంలో స్వామివారు ఎందుకు కోర్టు మెట్లు ఎక్కారు.. ఈ ఆసక్తికరమైన ప్రశ్నలకు సమాధానమే ఈ కథనభద్రాద్రి రామయ్య గోత్రం వశిష్ట. సీతమ్మది గౌతమస గోత్రం. ఈ గోత్రాల పేర్లను చదువుతూ అర్చకులు పూజలు చేస్తూ ఉంటారు. 2012 తర్వాత పండితులు స్వామివారిని అచ్యుత.. అమ్మవారిని సౌభాగ్య గోత్రాలుగా చదువుతున్నారు. ఈ మార్పు వెనుక ఉద్దేశం ఏమిటో తెలియదు. అయితే సీతారామ చంద్రుల గోత్రాలను 2012 నుంచి మార్చి చదువుతున్నారని ఓ భక్తుడు కోర్టు దాకా వెళ్లాడు.2022లో తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఒక కమిటీ ఏర్పాటు అయింది. ఆ కమిటీ దేవాదాయ శాఖకు నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికను దేవాదాయ శాఖ బయట పెట్టలేదు. దీంతో ఆ వ్యక్తి మళ్ళీ కోర్టును ఆశ్రయించాడు. దీనిపై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ సున్నితమైన వివాదంపై కోర్టు ఎలా విచారిస్తుంది? ఎటువంటి తీర్పు ఇస్తుంది అనేది చూడాల్సి ఉంటుంది.సీతారామచంద్రస్వామికి గురువారం రోజుల్లో కళ్యాణం.. మరో శుక్రవారం పట్టాభిషేకం జరుగుతాయి. ఇంతటి మహత్కార్యాల ముందు స్వామివారు గోత్రానికి సంబంధించి వివాదం ఎదుర్కోవడం.. అది కూడా కోర్టు దాకా వెళ్లడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. స్వామివారి గోత్రాలను మార్చి ఎందుకు చదువుతున్నారు.. గతంలో చదివిన వాటిని ఎందుకు పక్కన పెట్టారు.. అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదు.

# వ్యూహాత్మకంగా దెబ్బ తీస్తున్న రేవంత్

**హైదరాబాద్, మార్చి 25, పెన్ పవర్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వ్యూహాత్మకంగా బలహీనం చేయాలనుకుం టున్నారు. ఇందులో భాగంగా ఆయన మొదటగా ఆ పార్టీ ముఖ్యనే తలను బలహీనం చేయాలనుకుంటున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల కంచుకోటలను బద్దలు కొట్టాలనుకుంటున్నారు. సిద్ధిపేట, గజ్వేల్, సిరిసిల్ల ఈ మూడు కేవలం నియోజకవర్గాలు మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఈ కోటలనే లక్ష్యంగా చేసుకుని, గులాబీ దళపతులైన హరీష్ రావు, కేసీఆర్, , కేటీఆర్‌లను రాజకీయంగా బలహీనపరిచేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు బీఆర్ఎస్ అగ్రనేతల సొంత నియోజకవర్గాల్లో ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. సిద్ధిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం దీనికి స్పష్టమైన సంకేతం. హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటలో అడుగుపెట్టిన రేవంత్, అక్కడ అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపుతూనే, రాజకీయంగా ఆధిపత్యం సాధించేందుకు పావులు కదుపుతున్నారు. కేవలం గెలవడమే కాదు, ప్రత్యర్థి నాయకత్వాన్ని స్థానికంగా దెబ్బతీయాలన్నది రేవంత్ మాస్టర్ ప్లాన్. రేవంత్ రెడ్డి అనుకుంటున్నంత సులభంగా ఈ మూడు నియోజకవర్గాల్లో మార్పు రావడం అసాధ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సిద్ధిపేటలో హరీష్ రావుకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్, గజ్వేల్‌లో కేసీఆర్ పట్ల ఉన్న సెంటిమెంట్, సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధి పనులు ఆ నాయకులను ప్రజలకు దగ్గర చేశాయి. ఈ ముగ్గురూ తమ నియోజకవర్గాల్లో కేవలం రాజకీయ నాయకులుగానే కాకుండా, కుటుంబ సభ్యులుగా స్థిరపడిపోయారు. వారిని ఢీకొనాలంటే కేవలం అధికార బలం సరిపోదు, అంతకు మించిన ప్రజాదరణ ఉన్న నేతలు కాంగ్రెస్ వైపు ఉండాలి. ప్రస్తుతం ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడం. సిద్ధిపేటలో హరీష్ రావుకు దీటైన నాయకుడు కానీ, సిరిసిల్లలో కేటీఆర్‌ను అడ్డుకోగల చరిష్మా ఉన్న నేత కానీ ప్రస్తుతం కాంగ్రెస్‌లో కనిపించడం లేదు. ద్వితీయ శ్రేణి నాయకత్వం బలపడకుండా, కేవలం పైస్థాయి నుంచి చేసే విమర్శలు ఓట్లుగా మారవు. స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, బీఆర్ఎస్ అగ్రనేతల ప్రభావాన్ని తగ్గించగలిగే మాస్ లీడర్ల అవసరం కాంగ్రెస్‌కు ఉంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు. గతంలో ఇంద్రుడిలా వెలిగిన ఎందరో అగ్రనేతలు తమ సొంత గడ్డపైనే ఓటమి పాలైన చరిత్ర ఉంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. ప్రభుత్వ పథకాలను ఈ నియోజకవర్గాల్లో సమర్థవంతంగా అమలు చేస్తూ, బీఆర్ఎస్ కేడర్‌ను ఆకర్షించడం ద్వారా ఆ కోటలను బీటలు వారేలా చేయవచ్చు. ముఖ్యంగా అభివృద్ధి పనుల్లో వివక్ష చూపుతున్నారనే ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడం రేవంత్ ముందున్న సవాలు. రేవంత్ రెడ్డి సంకల్పం గట్టిగానే ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల నాయకత్వాన్ని మర్చిపోయేలా చేసే స్థాయి ఉన్న నేతలు స్థానికంగా ఎదిగితేనే కాంగ్రెస్‌కు అక్కడ భవిష్యత్తు ఉంటుంది. ఒకవేళ రేవంత్ రెడ్డి ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయగలిగితే, అది తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అతిపెద్ద మలుపు అవుతుంది. ఇప్పటికే అక్కడ బలమైన నేతల్ని గుర్తించి ప్రోత్సహించే వ్యూహాన్ని రేవంత్ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో బలమైన పోటీ ఇచ్చే అభ్యర్థుల్ని రెడీ చేసుకున్నా అది బీఆర్ఎస్ పార్టీ వ్యూహాల్లో కీలకమైన మార్పులు తెస్తుంది. మరి రేవంత్ రాజకీయం ఈ సారి ఆయన వ్యూహాలకు తగ్గట్లుగా సాగుతుందా?

## చెత్త ట్రాక్టర్లను అడ్డుకుని.. ఆందోళన

**సత్తుపల్లి, మార్చి 25 పెన్ పవర్:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని సాగర్ కాల్వ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానికులు బుధవారం ఆందోళన చేపట్టారు. యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గతంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చినా యార్డును తరలించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెత్త ట్రాక్టర్లను అడ్డుకున్నారు.

## స్వల్పంగా పెరిగిన మిర్చి, పత్తి ధరలు

**వైరా, మార్చి 25 పెన్ పవర్:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మిర్చి, పత్తి ధరలు పెరిగాయి. క్వింటా ఏసీ మిర్చి ధర రూ. 19,200, నాన్ ఏసీ మిర్చి ధర రూ. 19,200, పత్తి ధర రూ. 7,600గా నమోదైంది. నిన్నటితో పోల్చితే ఏసీ మిర్చి ధర రూ. 200, నాన్ ఏసీ మిర్చి ధర రూ. 200, పత్తి ధర రూ. 75 పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. మార్కెట్ కమిటీ సభ్యులు ఈ వివరాలను వెల్లడించారు.

## ఆశా వర్కర్ల ఆందోళన

**మహబూబాబాద్, మార్చి 25 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో ఆశా వర్కర్లు బుధవారం తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం భారీ నిరసన చేపట్టారు. పెరిగిన పనిభారం, పెండింగ్‌లో ఉన్న వేతనాలు, మరియు ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా వారు గళమెత్తారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబాబాద్‌లో జరిగింది.

## వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ కన్వీనర్ల నియామకం



**ములుగు, మార్చి 25 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా, ములుగులోని స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గంలో వివిధ మండలాలకు బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్లను డాక్టర్ రాజయ్య బుధవారం నియమించారు. స్టేషన్ఘన్పూర్ కన్వీనర్ గా తోట సురేందర్, ధర్మసాగర్ కన్వీనర్ గా గుర్రపు ప్రవీణ్, రఘునాథ్ పల్లి కన్వీనర్ గా నాగేశ్వరరావు, వీలర్ కన్వీనర్ గా కొయ్యడ మహేందర్, చిలుపూరు మండల కన్వీనర్ గా రంగు హరీష్ లను నియమించారు. పార్టీ అభివృద్ధికి కన్వీనర్లతో కలిసి పనిచేయాలని రాజయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## ఐదేళ్ల చిన్నారిపై మైనర్ల లైంగికదాడి!

**భూపాలపల్లి, మార్చి 25 పెన్ పవర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడి జరిగింది. 11 ఏళ్లు, 13 ఏళ్లు వయసున్న ఇద్దరు మైనర్లు ఆడుకుందామని నమ్మించి పాపను తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. చిన్నారి అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు లైంగిక దాడిని నిర్ధారించారు. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులైన ఇద్దరు మైనర్లను జువైనల్ హోంకు తరలించనున్నట్లు తెలిపారు.

## గ్యాస్ సిలిండర్ కోసం జనం పడిగాపులు

**డోర్నకల్, మార్చి 25 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రమైంది. గత వారం రోజులుగా గ్యాస్ సరఫరా లేకపోవడంతో 1200 బుకింగ్‌లు పేరుకుపోయాయి. బుధవారం తెల్లవారుజాము నుండే గ్యాస్ కోసం ప్రజలు క్యూలో నిలబడ్డారు. సోమవారం సాయంత్రం 342 సిలిండర్లు దిగుమతి అయినప్పటికీ, అందరికీ సరిపోలేదు. పరిస్థితి విషమించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి, బుక్ చేసుకున్న వారికి ఇంటికే సిలిండర్లు వస్తాయని సర్దిచెప్పి, ప్రజలను పంపించారు.

## ఉప్పులింగాపూర్‌లో ఇసుక బహిరంగ వేలం

**నర్సాపూర్, మార్చి 25 పెన్ పవర్:** వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామంలో తహశీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో ఇసుక బహిరంగ వేలం నిర్వహించారు. అక్రమంగా స్వాధీనం చేసుకున్న ఇసుకను 16 మంది ప్రతిస్పర్థుల మధ్య అత్యధికంగా రూ. 52,000 ఆఫర్ చేసిన వ్యక్తికి అప్పగించారు. అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.

## ప్రజలు ఆందోళన చెందకుండా, వదంతులను నమ్మవద్దు

**మెదక్, మార్చి 25 పెన్ పవర్:** మెదక్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వదంతులను అధికారులు నిరాధారమని స్పష్టం చేశారు. జిల్లాలో 87 పెట్రోల్ బంకులు సక్రమంగా పనిచేస్తున్నాయని, ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందకుండా, వదంతులను నమ్మవద్దని అధికారులు సూచించారు.

## మెదక్‌లో బంజారా ఐక్య వేదిక నేతల అరెస్ట్

**సిద్దిపేట, మార్చి 25 పెన్ పవర్:** హైదరాబాద్‌లో సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బంజారా ఐక్య వేదిక నేతలు చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, శాంతిభద్రతల పరిరక్షణ కోసం మెదక్ పోలీసులు అధ్యక్షుడు జైపాల్ నాయక్‌తో సహా పలువురు నేతలను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అసెంబ్లీ ముట్టడిని అడ్డుకునేందుకు పోలీసులు విస్తృతమైన నిఘా, భద్రతా ఏర్పాట్లు చేశారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో దర్శనాలు నిలిపివేత

**హుస్నాబాద్, మార్చి 25 పెన్ పవర్:** కోహెడ ఉరగుట్ట కొండపై ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు దేవస్థానం ట్రస్ట్ ఒక ముఖ్య ప్రకటన చేసింది. మార్చి 19 నుంచి 23 వరకు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం పడిపూజతో ఆలయాన్ని మూసివేసినట్లు తెలిపారు. శబరిమల సంప్రదాయం ప్రకారం 41 రోజుల తరువాత మాత్రమే దర్శనాలు ప్రారంభమవుతాయని ఈ కాలంలో పూజారి మాత్రమే నిత్య పూజలు నిర్వహిస్తారని వెల్లడించారు.

## డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు

**గజ్వేల్, మార్చి 25 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సదస్సు చైర్పర్సన్, కళాశాల ప్రిన్సిపాల్ డా. సునీత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సులో విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు తమ పరిశోధనలను మౌఖిక, పోస్టర్ ప్రజెంటేషన్ల రూపంలో ప్రదర్శిస్తారని సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సీహెచ్ మధుసూదన్, కన్వీనర్ డాక్టర్ మహేష్ కుమార్ తెలిపారు.

# అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు



**ఆదిలాబాద్, మార్చి 25 పెన్ పవర్:** : ఆదిలాబాద్ జిల్లాలో పెట్రోల్ పంపుల వద్ద 'స్టాక్ లేదు' అనే బోర్డులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని, అత్యవసర సేవల వాహనాలకు ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, ఎలాంటి సమస్యలు లేదా సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1939ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇంధన కొరతకు తావు లేకుండా
# అప్రమత్తంగా ఉండాలి

**బోథ్, మార్చి 25 పెన్ పవర్:** : ఆదిలాబాద్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, ప్రజలకు ఇంధన కొరత తలెత్తకుండా నిల్వలను పర్యవేక్షిస్తూ, సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకునే పరిస్థితి రాకుండా అవగాహన కల్పించాలని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.

# రామనవమి నాడు సప్త సత్యనారాయణ కథలు, సన్మానం

**ముథోల్, మార్చి 25 పెన్ పవర్:** గురువారం, మార్చి 26, 2026న శ్రీ రామనవమి సందర్భంగా పల్సి బి తాండ గ్రామంలోని శ్రీ సద్గురు నారాయణ బాబా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 2:30 గంటలకు సప్త సత్యనారాయణ కథలు నిర్వహించబడతాయి. అదే రోజు, బాబా దత్త పుత్రిక, గురు పీఠాధిపతి కుమారి సోను మాతకి ఘనంగా సన్మాన కార్యక్రమం జరుగుతుంది. గురల్ తాండ వాస్తవ్యులు, అన్నదాతలు మరియు పల్సి బి తాండ గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కూడా ఉంటుంది. భక్తజనులు పాల్గొని బాబా ఆశీస్సులతో పాటు తీర్థప్రసాదం పొందాలని కోరడమైనది. ఈ కార్యక్రమాన్ని శ్రీ సద్గురు నారాయణ బాబా సంస్థానం అధ్యక్షుడు శ్రీ కిషన్ జాదవ్ గారు మరియు పల్సి బి తాండ గ్రామ ప్రజలు నిర్వహిస్తున్నారు.

## పెట్రోల్ బంకులకు క్యూ కట్టిన ప్రజలు

**ఖానాపూర్, మార్చి 25 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరారు. పెట్రోల్ దొరకడం లేదనే ప్రచారాలను నమ్మి, ఆందోళనతో వాహనాలతో పాటు డబ్బాల్లో నింపుకొని వినియోగదారులు వెళ్తున్నారు. మహారాష్ట్రలో పెట్రోల్ కొరత ఉందని బంధువుల ద్వారా తెలుసుకొని వచ్చామని కొందరు తెలిపారు. అయితే, జిల్లాలో ఇంధన కొరత లేదని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు.

# జీవన్ రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా, 1,500 మంది అనుచరులతో ప్రకటన

**జగిత్యాల, మార్చి 25 పెన్ పవర్:** సీనియర్ నేత జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను పార్టీ చేరదీస్తుండటంతో ఆయన అసంతృప్తితో ఉన్నారు. పార్టీ పెద్దలు బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో, సన్నిహితులతో చర్చించి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు 1,500 మంది అనుచరుల సమక్షంలో ప్రకటించారు. ఆయన తదుపరి రాజకీయ ప్రస్థానంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# రైతులకు పురుగుమందుల వాడకంపై అవగాహన సదస్సు

**కరీంనగర్, మార్చి 25 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా, సైదాపూర్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో బుధవారం రోజున బీసీఐ ఆధ్వర్యంలో రైతులకు పురుగుమందుల వాడకంపై అవగాహన సదస్సు మరియు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీఐ అసిస్టెంట్ పియు మేనేజర్ రామారావు, ప్రాజెక్టు సమన్వయ కర్త సోని పాల్గొన్నారు. రైతులు పంట పరిశీలన చేసి, ఆర్థిక నష్ట పరిమితి దాటితేనే పురుగుమందులు పిచికారి చేయాలని, పిచికారి చేసేటప్పుడు తప్పక రక్షణ దుస్తులు ధరించాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

**హుజూరాబాద్, మార్చి 25 పెన్ పవర్:** చిగురుమామిడి మండలం రేకొండలో సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపగాని రమేశ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పొలం పనులకు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఆయన బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేశ్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి అతన్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా శ్రీసీతారాముల కళ్యాణం, పూజలు

**వేములవాడ, మార్చి 25 పెన్ పవర్:** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా 7వ రోజు బుధవారం పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల స్వామివారికి పంచోపనిషత్తు విధానంలో అభిషేకం, శ్రీ రామచంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు, శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు ఘనంగా నిర్వహించారు.

# రాజీతో కేసులను పరిష్కరించుకోండి: ఎస్పీ

**సిరిసిల్ల, మార్చి 25 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఈనెల 28వ తేదీ శనివారం రోజున నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ఆస్తి విభజన, కుటుంబ నిర్వహణ, వైవాహిక, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, చిన్నచిన్న పెట్టి కేసులు వంటి రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.

## గ్యాస్ కృత్రిమ కొరత సృష్టించొద్దు: సీపీఐ

**ఖమ్మం, మార్చి 25 పెన్ పవర్:** వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలించవద్దని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీని పార్టీ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. యుద్ధం పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## ఇల్లంతకుంటలో సీతారాముల ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా



**మానకొండూరు, మార్చి 25 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో శ్రీ సీతారాముల ఆలయంలో బుధవారం, 25 మార్చి 2026న సర్పంచ్ వొల్లాల రజిత, వెంకటేశం ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచే గణపతి పూజ, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గ్రానైట్‌తో చేసిన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


# పురాణ పురుషుడు శ్రీరామచంద్రుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతావని ప్రసవించిన మహాపురుషులలో అవతార పురుషుడు శ్రీరామచంద్రుడు అత్యంత ప్రాచీన చారిత్రక పురుష నాయకుడు. శ్రీరామచంద్రుని చారిత్రక పురుష నిగా పాశ్చాత్య పరిశోధకులు కూడా నిర్ధారించారు. భారతీయ కాలమాన ప్రకారం రాముడు జన్మించినది వైవస్వత మన్వంతరమున పంచమ త్రేతాయుగ నాలుగవ భాగమున ఎనభై వేల సంవత్సరానికి సరియగు విళంబి సంవత్సర చైత్ర శుద్ధ నవమి బుధవారం అని శ్రీమాన్ కోయిల్ కందాడై వెంకట సుందరాచార్య స్వామి వచించారు. పురాణాల ఆధారంగా మహాభారత యుద్ధం నాటికి శ్రీరాముడు అతి ప్రాచీనుడు. మను చక్రవర్తి వంశావళిలో రాముడు 65వ పురుషుడని, ఆయన వంశస్తుడు శ్రీకృష్ణునికి సమకాలికుడైన బృహద్బలుడు మను వంశమున 94వ వాడని సుప్రసిద్ధ పాశ్చాత్య చారిత్రిక పరిశోధకుడు పరిటేరు నిర్ణయించాడు. వాల్మీకి రామాయణమును అనుసరించి రాముని జననకాలం క్రీ.పూ. 2055వ సంవత్సరంగా ఎల్.డి.స్వామికన్ను పిళ్ళై నిర్ధారించగా, ఎం.ఆర్. సంపత్కు మార సమర్థించారు. పాశ్చాత్య చరిత్రకారులైన డబ్ల్యు.డబ్ల్యు.హంటర్, కానింగ్ ఆర్నాల్డ్ వంటి వారు, రామాయణ చరిత్ర క్రీ.పూ.1000 సంవత్సరాల ప్రాంత మని పేర్కొన్నారు. ప్రాచీన రుగ్వేద మంత్రమున (+.93.14) శ్రీరామ పవిత్ర నామం స్మరించ బడింది. మహా విష్ణువు ఎత్తిన 10 అవతారాలలో ఏడవది రామావ తారం. శ్రీరాముడు కోసలాధీశుడైన దశరథునికి, కౌసల్య గర్భమున చైత్ర శుద్ధ నవమి పునర్వసు 4వ పాదమున కర్కాటక లగ్నంలో మధ్యాహ్న సమయాన జన్మించాడు. అందుకే చైత్ర శుద్ధ నవమి శ్రీరామ జయంతి దినమైంది. ఇది వసంత నవరాత్రులకు చివరిదినం. రాముడు పుట్టి నది నవమికాగా, అంతకు ముందు అనగా రాముడు గర్భంలో ఉన్న చివరి తొమ్మిది దినాలు చేసే మత విధులు, పూజాదికాలు గర్భ నవరాత్రులుగా ఆరాధ నీయం, ఆచరణీయంగా ఉన్నాయి. ఆగస్త్య సంహితలో అష్టమి గురుపూజ, నవమి ప్రతిమా కల్పన, దశమి ప్రతిమా దానంగా మూడునాళ్ళ పండగగా చెప్పబడింది. నవమి ఉపవాసం, రాత్రి పురాణ శ్రవణం, జాగరణ, మరు నాడు సంతర్పణ చేయాలని ఉంది. పునర్వసు నక్షత్ర యుక్త నవమి పుణ్యకాలమని భావిస్తారు. అష్టమితో కూడిన నవమిని రామపూజ కూడదని విష్ణుభక్తులకు అగస్త్య సంహిత సూచిస్తున్నది. అందుకే మిగులు నవమి నాడు వైష్ణవులు రామ జయంతిని జరపడం పాటిస్తారు. శ్రీరామ నవమి నాటి కార్యకలాపాలు మధ్యాహ్నం 12గంటలకు చేయాలని వ్రత గ్రంథాలు సూచిస్తున్నాయి. రామ జననం, కల్యాణం జరిపే రామ నవమి కాకుండా రామ సంబంధ పండగలలో ఒకటి రామలక్ష్మణ ద్వాదశిగా జరుపుకునే జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి, రెండవది జానకీ జయం తిగా జరుపుకునే ఫాల్గుణ శుద్ధ అష్టమి. జనకునికి యజ్ఞ శాలకై భూమిని దున్నతుండగా నాగటి చాలుకు తగిలిన బంగారు పెట్టెలో భూజాత దొరికినది ఫాల్గుణ శుక్ల అష్ట మిగా భావిస్తారు. శ్రీకృష్ణునిలా కాక, రాముని జన్మదినో త్సవం కన్నా కళ్యాణోత్సవానికి విశిష్టత ఉంది. రామ జన్మకు కారణమైన రావణవధ ద్వారా లోకకళ్యాణం. సీతాదే వితో కూడిన రాముని వల్లే లోక కళ్యాణం సాధ్యమైంది. రాముని ఆంధ్రుల దౌహిత్రునిగా భావిస్తారు. కోసలాదేశ రాజు కూతురు కౌసల్య. దక్షిణ కోసల అంటే పూర్వాంధ్ర దేశ ఉత్తర భాగం. కౌసల్య ఆంధ్రుల ఆడపడచు అనీ, వన వాసాన్ని రాముడు తల్లి పుట్టింటి దేశపుటడవులలో గడిపా రని వాదం ఉంది. వనవాస రాఘవునికి ఆతిథ్యమిచ్చిన తెలుగు నేలపై ఆయన జన్మదినమైన శ్రీరామనవమి, కళ్యాణ దినంగా ఘనంగా జరుపుకోవడం సనాతన సాంప్రదాయంగా వస్తున్నది. శ్రీరాముని జన్మసమయం గురించి పరిశోధన చేసేందుకు పుష్కర్ భట్నాగర్, అమెరికా నుంచి 'ప్లానెటోరియం' అనే సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి, ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో ఏ రోజున గ్రహగతులు ఎలా ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం చేశారు. శ్రీరాముడు పుట్టిన సమయంలో గ్రహాల స్థితి వాల్మీకి బాలకాండలో వర్ణించారు.

ఈ సమాచారాన్నంతా సాఫ్ట్‌వేర్ సాయంతో క్రోడీకరించిన పుష్కర్ భట్నాగర్‌కు సదరు జన్మ సంవత్సరం తేలింది. చాంద్రమానం ప్రకారం ఆ రోజు చైత్రశుద్ధ నవమి అని తేలడంతో, ఆయన వాదనకు బలం చేకూరి, రామాయణంలో ఉట్టంకించిన గ్రహస్థితులను బట్టి... రాములవారు అరణ్యావాసం చేసిన సమయం (5089 బి.సి), హనుమంతుడు సీతను లంకలో కలుసుకున్న సంవత్సరం (5076 బి.సి) తదితర కాలాలను కూడా నిర్ణయించామన్నారు భట్నాగర్.పురాణాలను, జ్యోతిష్యాన్ని, ఖగోళ శాస్త్రాలను అనుసంధానపరుస్తూ, కొందరు పరిశోధన చేసి, శ్రీరాముడు పుట్టింది క్రీ.పూ 5114 సంవత్సరం, జనవరి 10 మధ్యాహ్నం 12:05 గంటలు అని తేల్చారు. ఏది ఏమైనా, వాస్తవాలు ఏవైనా, శ్రీరామ చంద్రుడు చారిత్రక పురుషునిగా భావించబడుతూ, పితృవాక్య ఆచరణాసక్తునిగా, ఆదర్శ చక్రవర్తిగా, రామరాజ్య స్థాపకునిగా, ప్రజారంజక పాలకునిగా, ఈనాటికీ పూజింప బడుతుండడం, ఆ మహాపురుషుని నవరాత్రులు, జన్మ, కళ్యాణోత్సవాలు, ఈ నాటికీ నిర్వహించబడుతుండడం విశేషం.

# మూర్ఛబాధితులకు అండగా నిలుద్దాం

**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ శరీరంలో అత్యంత సంక్లిష్టమైన అవయవం మెదడు. కోట్లాది నాడీ కణాల సమన్వయంతో సాగే ఈ జీవయంత్రంలో తలెత్తే స్వల్ప విద్యుత్ అసమతుల్యత వ్యక్తి జీవితాన్నే తలకిందులు చేస్తుంది. అటువంటి ఒక నాడీ సంబంధిత దీర్ఘకాలిక సమస్యే 'మూర్ఛవ్యాధి'. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు ఐదు కోట్ల మందిని పీడిస్తున్న ఈ రుగ్మత, కేవలం శారీరక సమస్యగానే కాకుండా సామాజిక వివక్షకు, మానసిక వేదనకు కారణమవుతోంది. ప్రతి సంవత్సరం మార్చి 26వ తేదీన నిర్వహించే 'ప్రపంచ మూర్ఛవ్యాధి అవగాహన దినోత్సవం' (పర్పుల్ డే)ఈ వ్యాధిపట్ల ఉన్న అజ్ఞానపు పొరలను తొలగించి, బాధితులకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడమే లక్ష్యంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో, మూర్ఛవ్యాధి మూలాలు, చికిత్సా పద్ధతులు, సామాజిక బాధ్యతలపై లోతైన విశ్లేషణ అవసరం. వైద్యపరిభాషలో మూర్ఛవ్యాధిని ఒక వ్యాధిగా కంటే ఒక లక్షణాల సముదాయంగా పరిగణించడం సముచితం. మెదడులోని నాడీ కణాలు అసాధారణంగా, అతివేగంగా విద్యుత్ సంకేతాలను విడుదల చేసినప్పుడు శరీర నియంత్రణ తప్పుతుంది. దీనినే 'సీజర్' లేదా 'ఫిట్స్' అంటారు. అయితే, ఒకసారి ఫిట్స్ వచ్చిన ప్రతి వ్యక్తి మూర్ఛవ్యాధిగ్రస్తుడు కాదు. ఎటువంటి ప్రేరణ లేకుండా పునరావృతమయ్యేలా ఫిట్స్ వస్తేనే దానిని 'ఎపిలెప్సీ'గా నిర్ధారిస్తారు. గణాంకాలను పరిశీలిస్తే, ప్రపంచంలోని మూర్ఛ బాధితుల్లో సుమారు 80 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఉండటం గమనార్హం. భారతదేశంలో దాదాపు 1.2 కోట్ల మంది ఈ సమస్యతో పోరాడు తున్నారని అంచనా. ఈ సంఖ్య కేవలం ఒక అంకె మాత్రమే కాదు, దీని వెనుక కొన్ని కోట్ల కుటుంబాల ఆవేదన దాగి ఉంది. చరిత్ర పుటలను తిరగేస్తే, మూర్ఛవ్యాధి గురించి ప్రాచీన నాగరికతల్లోనే ప్రస్తావనలు ఉన్నాయి. కానీ, ఆ కాలంలో దీనిని వైద్య సమస్యగా కాకుండా దైవశాపం గానో, చేతబడి వంటి క్షుద్ర శక్తుల ప్రభావం గానో భావించేవారు. గ్రీకు వైద్య పితామహుడు హిపోక్రటీస్ క్రీస్తుపూర్వమే దీనిని 'పవిత్ర వ్యాధి' కాదని, ఇది మెదడుకు సంబంధించిన జబ్బు అని ప్రపంచానికి చాటిచెప్పాడు. అయినప్పటికీ, శతాబ్దాల తరబడి కొనసాగిన మూఢ నమ్మకాలు నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో వేళ్లూనుకుని ఉన్నాయి. బాధితులను సామాజికంగా వెలివేయడం, వివాహాలకు అనర్హులుగా ప్రకటించడం, ఉపాధి అవకాశాలు నిరాకరించడం వంటి చర్యలు వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. మూర్ఛవ్యాధి రావడానికి కారణాలు బహుముఖంగా ఉంటాయి. శిశువు గర్భంలో ఉన్నప్పుడు లేదా ప్రసవ సమయంలో ఆక్సిజన్ అందకపోవడం వల్ల మెదడు దెబ్బతినడం ప్రాథమిక కారణం కావచ్చు. అలాగే వయస్సు పెరిగే కొద్దీ మెదడుకు తగిలే గాయాలు, ట్యూమర్లు, ఇన్ఫెక్షన్లు (మెనింజైటిస్ వంటివి), స్ట్రోక్ వంటివి ఈ వ్యాధికి దారితీస్తాయి. సుమారు 50 శాతం కేసుల్లో జన్యుపరమైన కారణాలు కూడా ఉండవచ్చు. అయితే, విచారకరమైన విషయం ఏమిటంటే, సగానికి పైగా కేసుల్లో ఖచ్చితమైన కారణం ఇప్పటికీ అన్వేషణలోనే ఉంది. లక్షణాల విషయానికి వస్తే, మూర్ఛ అంటే కేవలం కిందపడి చేతులు కాళ్లు కొట్టుకోవడం మాత్రమే కాదు. ఒక్క క్షణం పాటు శూన్యంలోకి చూడటం, తెలియకుండానే పెదవులు చప్పరించడం, మాట తడబడటం వంటివి కూడా మూర్ఛ లక్షణాలే కావచ్చు. అందుకే వీటిని గుర్తించడంలో అప్రమత్తత అవసరం. చికిత్స విషయంలో ప్రపంచ వ్యాప్తంగా అద్భుతమైన పురోగతి లభించింది. ఆధునిక వైద్యశాస్త్రం అందించిన ఈఈజీ , ఎంఆర్ఐ వంటి పరీక్షల ద్వారా మెదడులో సమస్య ఎక్కడ ఉందో ఖచ్చితంగా తెలుసుకోవచ్చు. బాధితుల్లో 70 శాతం మందికి కేవలం క్రమబద్ధమైన మందుల వాడకం ద్వారా మూర్ఛను పూర్తిగా నియంత్రించే అవకాశం ఉంది. కొన్ని తీవ్రమైన కేసుల్లో శస్త్రచికిత్స లేదా వేగస్ నర్వ్ స్టిమ్యులేషన్ వంటి ఆధునిక పద్ధతులు ప్రాణదాతలుగా నిలుస్తున్నాయి. కానీ, విచారకరమైన వాస్తవం ఏమిటంటే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 70 శాతం మంది బాధితులకు సరైన మందులు అందుబాటులో లేవు. ఆర్థిక స్తోమత లేకపోవడం ఒక కారణమైతే, మూఢనమ్మకాలతో నాటు మందులు, మంత్రగాళ్ల చుట్టూ తిరగడం మరొక కారణం. మూర్ఛవ్యాధి పట్ల సమాజం తన వైఖరిని మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. బాధితులకు ఫిట్స్ వచ్చినప్పుడు జనం భయాందోళనలకు గురవుతుంటారు. ఆ సమయంలో రోగి నోట్లో చెంచాలు పెట్టడం, ఇనుప వస్తువులు చేతిలో ఉంచడం, మొఖంపై నీళ్లు చల్లడం వంటివి అస్సలు చేయకూడదు. రోగిని సురక్షితంగా ఒక పక్కకు తిప్పి పడుకోబెట్టాలి. శ్వాస సరిగ్గా ఆడేలా చూడాలి. సాధారణంగా మూర్ఛ రెండు నిమిషాల్లో తగ్గిపోతుంది. అంతకు మించి సమయం తీసుకుంటే వెంటనే ఆసుపత్రికి తరలించాలి. ఈ ప్రాథమిక అవగాహన ప్రతి ఒక్కరిలో ఉంటే బాధితులకు ఎంతో మేలు జరుగుతుంది. విద్య, ఉద్యోగ రంగాల్లో మూర్ఛ వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడటం మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది. ఈ వ్యాధి ఉన్నవారు

కూడా మేధావులుగా, క్రీడాకారులుగా, కళాకారులుగా రాణించగలరు. చరిత్రలో జూలియస్ సీజర్, సర్ ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వాన్ గోహ్ వంటి అసాధారణ వ్యక్తులు మూర్ఛవ్యాధితో ఉండి కూడా ప్రపంచాన్ని ప్రభావితం చేసినవారే. సరైన చికిత్స పొందుతున్న వారు డ్రైవింగ్, భారీ యంత్రాల నిర్వహణ వంటి కొన్ని పరిమితులు మినహా మిగిలిన అన్ని పనులను ఇతరుల వలె సాధారణంగా చేసుకోగలరు. వారిని అక్కున చేర్చుకోవడం సమాజ బాధ్యత. ముగింపుగా, 'పర్పుల్ డే' అనేది కేవలం ఒక రంగుకు పరిమితమైన రోజు కాదు; అది ఆశకు, అవగాహనకు సంకేతం. మూర్ఛవ్యాధి అనేది ఒక శారీరక రుగ్మత మాత్రమే తప్ప అది సామాజిక కళంకం కాదు. ప్రభుత్వం, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు మరియు పౌర సమాజం సమన్వయంతో పనిచేస్తే, ఈ వ్యాధి పట్ల ఉన్న భయాలను పారద్రోలవచ్చు. పరిశోధనలు మరింత వేగవంతమై, తక్కువ ఖర్చుతో కూడిన వైద్యం అందరికీ అందుబాటులోకి రావాలి. బాధితులకు సామాజిక మద్దతును, మానసిక ధైర్యాన్ని అందించినప్పుడే మనం ఆరోగ్యవంతమైన, వివక్ష లేని సమాజాన్ని నిర్మించగలం. మూర్ఛపై అవగాహన పెంచుకుందాం, బాధితుల జీవితాల్లో వెలుగులు నింపుదాం.

# కొండమల్లేపల్లి పశువుల సంత వేలంలో రికార్డు



**దేవరకొండ, మార్చి 25 పెన్ పవర్:** నల్గొండ జిల్లా, దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని కొండమల్లేపల్లిలో బుధవారం జరిగిన పశువుల సంత వేలం పాటలో సరికొత్త రికార్డు నమోదైంది. వర్కాల భాస్కర్ రెడ్డి 3 కోట్ల 80 లక్షల ఒక వెయ్యి రూపాయలకు సంతను దక్కించుకున్నారు. గతంలో కోటి 22 లక్షలు ఉన్న వేలం ఈసారి మూడు కోట్లు దాటడం విశేషం. మొత్తం 25 మంది పోటీ పడిన ఈ వేలంతో గ్రామ పంచాయతీకి భారీగా ఆదాయం సమకూరనుంది.

# అత్యవసర రోగులు రావొద్దు!

**ముషీరాబాద్, మార్చి 25 పెన్ పవర్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో తరచూ పరికరాలు మొరాయిస్తున్నా యి. తాజాగా గాంధీ ఆసుపత్రిలో అయిదు రోజుల నుంచి సీటీస్కాన్ యంత్రం పనిచేయడం లేదు. ఏడాదిన్నర క్రితమే దీనిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే రెండుమూడు సార్లు మరమ్మతులకు గురైంది. తాజాగా మరోసారి పనిచేయక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని అత్యవసరంగా గాంధీకి తీసుకొచ్చారు. సీటీస్కాన్ పనిచేయకపోవడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గాంధీలో రెండు సీటీస్కాన్ యంత్రాలుండగా పాతది ఎప్పుడో మూలకు చేరింది. రెండోది తరచూ మొరాయిస్తోంది. ఉస్మానియాలోనూ సీటీస్కాన్‌కు రెండు మూడు వారాలు పడుతోంది. శరీరం లోపలి భాగాల్లోని గాయాలు, వ్యాధులను గుర్తించడానికి సీటీస్కాన్ చాలా కీలకం.

# ఏపీలో మహిళా నియోజవర్గాలు..ఇవే

**తిరుపతి,మార్చి 25, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా నియోజకవర్గాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్డీఏ సమావేశంలో స్పష్టమైన సంకేతాలు అందాయి దీనిపై. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే పునర్విభజన బిల్లు పార్లమెంట్లో ఆమోదించనున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా పార్లమెంట్ సీట్లతో పాటు అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే ఇప్పటికే మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తూ 2023లో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందింది. అయితే ఇప్పుడు పునర్విభజన బిల్లుతో పాటు మహిళా బిల్లును కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సంచలనంగా మారింది. పునర్ విభజనకు సంబంధించి ఏపీలో 50% చొప్పున అసెంబ్లీ, లోక్సభ సీట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనతో అసెంబ్లీ స్థానాలు 263, లోక్సభ సీట్లు 38 కి చేరుకుంటాయి. మహిళా ప్రాతినిధ్యం కూడా పెరగనుంది. వారికి 87 అసెంబ్లీ, 13 పార్లమెంట్ సీట్లు దక్కనున్నాయి. అయితే ఫలానా నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ చేస్తారని చెప్పడం కష్టం కానీ.. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండే నియోజకవర్గాలను మాత్రం మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో 58 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికం. వాటిని మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో ప్రధానంగా భీమిలి నియోజకవర్గం లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అక్కడ ఏకంగా 1,65,570 మంది మహిళలు ఉండడం విశేషం. పాణ్యం, గాజువాక, చంద్రగిరి, తిరుపతి, మంగళగిరి, పెనమలూరు, రంపచోడవరం, పెందుర్తి, గురజాల, విశాఖపట్నం నార్త్,కోవూరు, కర్నూలు, విజయవాడ ఈస్ట్,విజయవాడ సెంట్రల్, గుంటూరు వెస్ట్,గన్నవరం, మైలవరం, నెల్లూరు రూరల్, తెనాలి, నంద్యాల, అనంతపురం అర్బన్, ఇచ్ఛాపురం, కడప, శ్రీకాకుళం, చింతలపూడి, రాజమహేంద్రవరం సిటీ,ప్రత్తిపాడు, రాజమహేంద్రవరం రూరల్, గుంతకల్లు, కాకినాడ సిటీ, పలమనేరు, విశాఖపట్నం ఈస్ట్, మాచర్ల,వినుకొండ, కాకినాడ రూరల్, భీమవరం, రాయదుర్గం, మదనపల్లి,పోలవరం, కావలి,జమ్మలమడుగు,కొత్తపేట, పాయకరావుపేట, శ్రీకాళహస్తి, ప్రొద్దుటూరు,ఆదోని, విజయనగరం, రాయచోటి, కదిరి, రాప్తాడు,ఆలూరు, గుంటూరు ఈస్ట్, విజయవాడ వెస్ట్, గూడూరు, ఒంగోలు, బనగానపల్లె,తాడిపత్రి నియోజకవర్గాల్లో మహిళలు అధికం.పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి విశాఖపట్నంలో అత్యధికంగా 9,20,376 మంది మహిళలు ఉన్నారు. ఆ తరువాత స్థానాల్లో గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, నంద్యాల,విజయవాడ, కర్నూలు,కాకినాడ, ఏలూరు, కడప, చిత్తూరు, రాజంపేట, శ్రీకాకుళం, అనకాపల్లి, హిందూపురం, రాజమండ్రి,ఒంగోలు, అరకు, విజయనగరం, మచిలీపట్నం, బాపట్ల, అమలాపురం, నరసాపురం పార్లమెంట్ స్థానాల్లో మహిళలు ఎక్కువ. మరి ఈ నియోజకవర్గాల్లో మహిళలకు ఛాన్స్ దక్కుతుందా? లేదా? అన్నది చూడాలి.


# జనసేనలో వారసుల తంటా

**కాకినాడ, మార్చి 25, పెన్ పవర్:** జనసేన పార్టీ ప్రారంభం నుంచే కొన్ని స్పష్టమైన సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించకూడదనే ఆలోచన పార్టీకి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఆ సమయంలో పార్టీకి పెద్దగా ప్రభావం కనిపించలేదు. అయితే 2024 ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పార్టీకి ప్రజల్లో డిమాండ్ పెరిగింది, నాయకులు కూడా ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఈ మార్పు వల్లే జనసేన రాజకీయంగా బలపడినట్టు కనిపిస్తోంది.దీంతో జగ్గంపేట వంటి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం పోటీ తీవ్రంగా జరిగింది. పార్టీ బలపడటంతో నాయకులు కూడా తమ స్థానం కోసం ప్రయత్నాలు పెంచారు. అయితే ఇప్పుడు మరో ఆసక్తికరమైన పరిణామం కనిపిస్తోంది. కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. బహిరంగంగా పెద్దగా మాట్లాడకపోయినా, నియోజకవర్గ స్థాయిలో తమ వారిని ప్రోత్సహిస్తూ మౌనంగా వ్యూహాలు అమలు చేస్తున్నారు.ప్రస్తుతం ఉన్న 21 మంది ఎమ్మెల్యేలలో కొందరు తమ వారసులను రంగంలోకి దించాలనే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు కొంతమంది సీనియర్ నాయకులు కూడా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమ కుటుంబ సభ్యులకు అవకాశాలు కల్పించాలని చూస్తున్నారు. అయితే ఈ పరిస్థితి




జనసేన పార్టీ అసలు సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటివరకు ప్రజల్లో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. వారసత్వం కంటే ప్రజాదరణ ఉన్నవారిని ఎంపిక చేయడమే ఆయన విధానంగా కనిపిస్తోంది. గతంలో కూడా ఆయన ఇదే విధంగా టికెట్లు ఇచ్చారు. కాకినాడ రూరల్ నుంచి నానాజీ , రైల్వే కోడూరు నుంచి అరవ శ్రీధర్ వంటి వారికి అవకాశం కల్పించారు. వీరంతా తమ పనితీరు ద్వారా గుర్తింపు పొందిన వారే.ఇప్పుడూ అదే విధానాన్ని కొనసాగించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. ఈ పరిస్థితిలో పార్టీ తీసుకునే నిర్ణయం కీలకం అవుతుంది. మొత్తంగా చూస్తే, జనసేన పార్టీ సిద్ధాంతాలు ఒకవైపు, నాయకుల వ్యక్తిగత ఆశయాలు మరోవైపు ఉన్న పరిస్థితి ఏర్పడింది. పవన్ కళ్యాణ్ ఈ రెండింటి మధ్య ఎలా సమతుల్యం పాటిస్తారు, వారసత్వ రాజకీయాలపై ఎంతవరకు రాజీ పడతారు అనేది వచ్చే రోజుల్లో స్పష్టత వచ్చే అంశంగా మారింది.

# జగన్ ఇమేజ్ డ్యామేజ్



**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంలో చెలరేగిన ఆస్తుల వివాదం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలతో జగన్ సాగిస్తున్న ఈ న్యాయపోరాటం కేవలం ఒక కుటుంబ సమస్యగా కాకుండా, రాజకీయంగా పెను ప్రభావం చూపే అంశంగా మారింది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఆస్తుల పంపిణీ విషయంలో జగన్, షర్మిల మధ్య విభేదాలు పొడసూపాయి. గతంలో కుదుర్చుకున్న ఒక అవగాహన ఒప్పందం ప్రకారం కొన్ని ఆస్తులను చెల్లికి బదలాయించాల్సి ఉండగా, జగన్ ఆ ప్రక్రియను నిలిపివేయడం వివాదానికి కేంద్రబిందువు అయింది. ఈ క్రమంలో జగన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించడం, షర్మిలకు ఇచ్చిన షేర్లను తిరిగి తీసుకోవాలని కోరడం సంచలనం సృష్టించింది. దీనికి ప్రతిగా తల్లి విజయమ్మ, షర్మిల తరపున నిలబడి అఫిడవిట్ దాఖలు చేయడం జగన్‌కు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది.జగన్ రాజకీయ జీవితం మొత్తం “మాట తప్పను.. మడమ తిప్పను” అనే నినాదం చుట్టూ తిరుగుతుంది. అయితే, తండ్రి బతికి ఉన్నప్పుడు చెప్పిన అంశాలను, కుటుంబ ఒప్పందాలను ధిక్కరించడం వల్ల ఆయన ‘విశ్వసనీయత’ ప్రశ్నార్థకమైంది. సొంత తల్లిని, చెల్లిని కోర్టుకు లాగడం అనేది తెలుగు సమాజంలో నైతికంగా ఆమోదయోగ్యం కాని విషయం. సామాన్యులెవరూ దీన్ని అంగీకరించరు. చెల్లి విషయంలో అయినా కాస్త ఆలోచిస్తారేమో కానీ, తల్లిని కూడా జగన్ ఇబ్బంది పెడుతున్నారనే అంశమే ప్రజల్లోకి బాగా వెళ్తోంది. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను గణనీయంగా దెబ్బతీస్తోంది.ఈ వివాదం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంది. జగన్ తన పాలనలో 'అక్కా.. చెల్లెమ్మ' అంటూ మహిళలకు ప్రాధాన్యతనిచ్చారు. కానీ సొంత చెల్లికి ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారం మహిళా ఓటర్లలో ప్రతికూల భావనను కలిగించే అవకాశం ఉంది. టీడీపీ, జనసేన వంటి పార్టీలు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నాయి. “సొంత తల్లికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు?” అనే ప్రశ్నను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న వైసీపీ కార్యకర్తలు ఈ వివాదంపై ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం విడిపోవడం వల్ల పార్టీ పట్ల ఉన్న సెంటిమెంట్ పలచబడే ప్రమాదం ఉంది.జగన్ తన ఆస్తులు ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్నాయని, అందుకే బదలాయింపు సాధ్యం కాదని వాదిస్తున్నారు. కానీ, కుటుంబ సభ్యులు దీనిని కేవలం జగన్ ‘మొండితనం’గా భావిస్తున్నారు. ఆస్తుల విలువ కంటే, తన మాటే చెల్లాలనే ఆయన ‘ఈగో’ వల్లనే ఈ సమస్య ఇంతవరకు వచ్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజకీయ చాణక్యత ప్రదర్శించాల్సిన చోట, జగన్ తన కుటుంబంపై కఠినంగా వ్యవహరించడం వ్యూహాత్మక తప్పిదమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.జగన్ ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకోకపోతే, భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆస్తుల వల్ల ఆర్థిక బలం పెరగవచ్చు కానీ, రాజకీయాల్లో అత్యంత విలువైన ప్రజాభిమానం, విశ్వసనీయతను ఆయన కోల్పోయే ప్రమాదం ఉంది. తల్లి విజయమ్మ ప్రత్యక్షంగా షర్మిల వెనుక నిలబడటం జగన్ రాజకీయ ప్రయాణంలో అతిపెద్ద సవాలుగా మిగిలిపోనుంది.

# ఢిల్లీలోనూ నెంబర్ 11 తంటా

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** ఢిల్లీలోని నూతన పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు విషయం.. ఏపీలో ఇప్పుడు ఆసక్తికర చర్చకు కారణమైంది. గదుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా స్పీకర్ కార్యాలయం.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11వ నంబర్ గది కేటాయించింది. పార్టీల బలాబలాల ఆధారంగా స్పీకర్ కార్యాలయం గదులను కేటాయిస్తోంది. ఈ క్రమంలోనే వైసీపీ ఎంపీల కోసం నూతన పార్లమెంట్ భవనం ఫస్ట్ ఫ్లోర్‌లోని 11వ నంబర్ గదిని కేటాయించారు. అయితే వైసీపీ ఎంపీలు.. తమ గదిని మార్చాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిసింది. స్పీకర్ ఓంబిర్లాతో భేటీ అయిన వైసీపీ ఎంపీలు.. తమకు 11వ నెంబర్ గద వద్దని కోరినట్లు తెలిసింది. అందుకు బదులుగా మరో గదిని కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. దీంతో వైసీపీ ఎంపీల విజ్ఞప్తిని సానుకూలంగా తీసుకున్న స్పీకర్.. వైసీపీ ఎంపీల కోసం 12వ నంబర్ రూమ్ కేటాయిస్తూ మార్పులు చేశారు.మరోవైపు నూతన పార్లమెంట్ భవనంలో టీడీపీకి 9వ నంబర్ గది కేటాయించారు. మొదటి అంతస్తులోని 9వ నంబర్ గదిని టీడీపీ ఎంపీల కోసం కేటాయించారు. కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి రావటంతో.. పాత పార్లమెంట్ భవనంలో ఉన్న పార్టీ ఆఫీసులనుఖాళీ చేయిస్తున్నారు. నూతన పార్లమెంట్ భవనంలో పార్టీలకు గదులు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలోనే వైసీపీకి 12, టీడీపీకి 9వ నంబర్ గదులు కేటాయించామరోవైపు 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైంది. 2019 ఎన్నికల్లో 151 సీట్లలో విజయం సాధించిన వైసీపీ.. 2024లో మాత్రం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా మంత్రివర్గంలోని నేతలందరూ ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ సామర్థ్యంలో పది శాతం సీట్లు సాధించకపోవటంతో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీకి ఏపీ ప్రభుత్వం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు.ఇదే సమయంలో వైసీపీ 11 సీట్లను పరోక్షంగా ఉద్దేశిస్తూ కూటమి పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తుంటారు. ఈ క్రమంలోనే నూతన పార్లమెంట్ భవనంలో వైసీపీకి 11 నంబర్ గది కేటాయించడం.. ఆ తర్వాత వైసీపీ ఎంపీల అభ్యర్థనతో దానిని 12వ నంబర్ గదికి మార్చటం చర్చనీయాంశమవుతోంది.

# బెజవాడలో ఏం జరుగుతోంది....

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** ఉగ్రవాదులతో సంబంధం ఉందని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు విజయవాడ సీసీఎం కోర్టు రిమాండ్ విధించింది. ఏప్రిల్ 6వ తేదీ వరకూ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఉన్నాయంటూ ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేసి ఉగ్రవాద భావజాలాన్ని యువతలో ప్రోత్సహించేందుకు వీరు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. విజయవాడలో ఉగ్రవాద సానుభూతిపరుల కదలికల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని.. సోషల్ మీడియా ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ డానిష్, మీర్జా సొహైల్ మహమ్మద్ రహంతుల్లా షరీఫ్ అనే ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ యువకులు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్ల నుంచి నిధులు సమకూరుతున్నట్లు నిఘావర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు ముగ్గురు నిందితులను విజయవాడ పోలీసులను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఏప్రిల్ ఆరో తేదీ వరకూ కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు వీరిని విజయవాడ సెంట్రల్ జైలుకు తరలించారు. మరోవైపు విచారణ సందర్భంగా లాయర్‌ను నియమించుకున్నారా? అని న్యాయమూర్తి నిందితులను ప్రశ్నించారు. అయితే తాము నియమించుకోలేమని నిందితులు కోర్టుకు తెలిపారు. దీంతో ఈ విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేయాలని కోర్టు ఆదేశించింది.మరోవైపు ఈ కేసులో యాంటీ టెర్రరిస్ట్ దళాలు జరిపిన విచారణలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముగ్గురు యువకులు ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో గ్రూపును ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఏడు రాష్ట్రాలలో 42 మంది సభ్యులతో ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ గ్రూపు ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటుగా ఢిల్లీ, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా గ్రూపులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీంతో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ముఖానికి మాస్కులతో ఫోటోలు, సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు, ఆడియోలు పెడుతున్నట్లు గుర్తించారు. పాకిస్థాన్ , అఫ్గానిస్తాన్‌లో ఉగ్రవాద శిక్షణకు వెళ్లేలా యువతను ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు

# అనంతలో ఓపెన్ కూలింగ్ సిస్టమ్

**అనంతపురం, మార్చి 25, పెన్ పవర్:** సవి కాలంలో వాహనదారులకు ఉపశమనం కలిగించేలా అనంతపురంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సురేష్ నాయక్ అనే ఉపాధ్యాయుడు ఆలోచనతో దీనిని రూపొందించారు. ప్రయోగాత్మకంగా సప్తగిరి సర్కిల్ వద్ద ఏర్పాటు చేశారు. దీని ద్వారా వాహనదారులపై తుంపర్లుగా నీటిని చల్లుతారు. దీంతో ఎండవేడిమి నుంచి వారికి ఉపశమనం కలుగుతుందని అధికారులు చెప్తున్నారు.వేసవి కాలం వచ్చేసింది. ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం పది గంటలకే భానుడు భగభగమండిపోతున్నాడు. మార్చి నెల మధ్యలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో భానుడి ఉగ్రరూపం మరోస్థాయికి చేరనుంది. ఈ నేపథ్యంలో ప్రజలు భయపడిపోతున్నారు. ఇక ఎండాకాలంలో రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి. ఓ వైపు సుర్రుమనిపించే సూరీడు.. మరోవైపు వేడిగాలులు.. దీంతో ఉక్కబోతను భరించలేక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఇక వాహనదారుల పరిస్థితి అయితే చెప్పక్కర్లేదు. పైన ఎండ, కింద బండి వేడితో ఇబ్బందుల పడుతుంటారు. ఈ నేపథ్యంలోనే అనంతపురం జిల్లాలో ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.రాజేంద్రనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న సురేష్ నాయక్ బుర్రలో మెదిలిన ఆలోచన ఇది. వేసవి తాపం నుంచి వాహనదారులకు ఉపశమనం కల్గించేందుకు సురేష్ నాయక్..ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఆలోచన చేశారు. ఇంజనీరింగ్ అధికారుల సహాయంతో అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఎండలకు వాహనదారులు ఇబ్బందులు పడకుండా సప్తగిరి సర్కిల్ వద్ద దీనిని ఏర్పాటు చేశారు.ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ అంటే.. ఒక డ్రమ్ములో నీళ్లను నింపుతారు. ఈ నీటిని మోటార్ల సాయంతో పైపుల ద్వారా తుంపర్లుగా.. రోడ్డుపైనే వెళ్లే వాహనదారులపై వదులుతారు. ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో కూడలి వద్ద ఉన్న వాహనదారులపై తుంపర్లు, తుంపర్లుగా నీరు పడటంతో.. వాతావరణం చల్లబడటంతో పాటుగా.. వారికి కాస్త ఉపశమనంగా ఉంటుందని అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని అధికారులు చెప్తున్నారు. మొత్తంగా ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ కారణంగా అనంతపురంలోని వాహనదారులు కాస్త రిలీఫ్ పొందుతున్నారు.

# రూరల్ డెవలప్మెంట్ ట్రస్టుకు లైన్ క్లియర్

**కర్నూలు, మార్చి 25, పెన్ పవర్:** కరువు సీమలో వెలుగులు నింపిన చరిత్ర రూరల్ డెవలప్మెంట్ ట్రస్టుదిదశాబ్దాలుగా అనంతపురం జిల్లాలోని లక్షలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపింది. అటువంటి ట్రస్ట్ మనుగడపై గత నీలి నీడలు అలుముకున్నాయి. ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులు లభించక విదేశీ నిధులు నిలిచిపోయాయి. ఆ సమస్త సేవలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇటువంటి తరుణంలో మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకున్నారు. ఆయన చొరవతో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కు కొత్త ఆశలు చిగురించాయి. లోకేష్ ప్రయత్నం ఫలించింది. రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిలబడగలిగింది.కరువు సీమలో ఆర్డిటి అంటే కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు.

పేదల బతుకులు ఆశా కిరణం. అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ వ్యాప్తంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి,, కరువు కోరల్లో చిక్కుకున్న రైతుల సాధికారతకు చాలా కృషి చేసింది. దశాబ్దాల కిందట చిన్న ఆశయంతో మొదలైన ఈ సంస్థ నేడు లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతూ.. దేశంలోనే అత్యంత ప్రభావంతమైన స్వచ్ఛంద సంస్థగా ఎదిగింది. వైద్యం, విద్య,, మహిళా సాధికారత, వికలాంగుల సంక్షేమం వంటి రంగాల్లో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అసాధారణంఅయితే ఇటీవల రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కు విదేశీ నిధులు నిలిచిపోయాయి. ఎఫ్ సి ఆర్ ఏ( టఛితీఖ ) అనుమతులు రద్దు రూపంలో ఎదురు దెబ్బ తగిలింది. దీంతో సేవా కార్యక్రమాలు నిలిచిపోయే పరిస్థితి ఎదురయింది. ఈ పరిణామంతో రాయలసీమలోని వేలాది పేద కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను ఆశ్రయించారు. సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి నారా లోకేష్ తక్షణం స్పందించారు. ట్రస్ట్ పారదర్శకమైన సేవలను పరిగణలోకి తీసుకొని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఏ రిజిస్ట్రేషన్ ను పునరుద్ధరించింది. దీంతో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ మళ్లీ నిధులను సేకరించి సేవా కార్యక్రమాలను ఆటంకం లేకుండా కొనసాగించే అవకాశం దక్కింది. అయితే ఈ ట్రస్ట్ సేవలను పునరుద్ధరించడంలో మంత్రి లోకేష్ చూపిన చొరవ ప్రశంసలు అందుకుంటోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# యుద్ధం ముగించేందుకు అమెరికా 15 డిమాండ్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో నెల రోజులుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా కీలక ముందడుగు వేసింది. యుద్ధాన్ని నిలిపివేసి, అణు కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు 15 సూత్రాలతో కూడిన ఒక విస్తృత ప్రణాళికను ఇరాన్‌కు పంపింది. మరోవైపు, ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఈ ప్రతిపాదనలను పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్ వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు చేరవేశారు. ఈ ప్రణాళిక ప్రకారం ఇరాన్ తన మూడు ప్రధాన అణు కేంద్రాలైన నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డోలను పూర్తిగా మూసివేయాలి. యురేనియం శుద్ధిని నిలిపివేసి, ఇప్పటివరకు శుద్ధి చేసిన అణు ఇంధనాన్ని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఎంఇం)కు అప్పగించాలి. బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని కూడా నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేసింది. ఈ షరతులకు అంగీకరిస్తే ఇరాన్‌పై విధించిన అన్ని అణు సంబంధిత ఆంక్షలను ఎత్తివేస్తామని అమెరికా హామీ ఇచ్చింది. అంతేకాకుండా, విద్యుత్ ఉత్పత్తి కోసం బుషెహర్‌లో పౌర అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేయడా నికి మద్దతు ఇస్తామని తెలిపింది. ఆంక్షలను తిరిగి విధించే "స్నాప్‌బ్యాక్" విధానాన్ని కూడా రద్దు చేస్తామని పేర్కొంది. ఈ అంశంపై అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం మాట్లాడుతూ "వారు ఒక ఒప్పందం చేసుకోవాలనుకుంటున్నారు.


## యూఏఈపై మళ్లీ వైమానిక దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** యునైటెడ్ అర్బన్ ఎమిరేట్స్(యుఎఈ) పై జరిగిన మరో వైమానిక దాడి యత్నాన్ని విజయవంతంగా తిప్పికొట్టినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మంగళవారం జరిగిన ఈ దాడిలో యూఏఈ వాయు రక్షణ వ్యవస్థ ఐదు బాలిస్టిక్ క్షిపణులు, 17 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఇరాన్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 357 బాలిస్టిక్ క్షిపణులు, 15 క్రూయిజ్ క్షిపణులు, 1,806 డ్రోన్లను నిర్వీర్యం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనల్లో విధుల్లో ఉన్న ఇద్దరు సైనికులు మరణించగా, పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, పాలస్తీనా దేశాలకు చెందిన ఆరుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. భారతీయులతో సహా వివిధ దేశాలకు చెందిన 161 మంది గాయపడ్డారు. దేశ భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని యూఏఈ అధికారులు స్పష్టం చేశారు.

## కువైట్ లో డ్రోన్ల దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డ్రోన్ దాడిలో ఇంధన ట్యాంకుకు నిప్పంటుకుంది. ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని కువైట్ విమానయాన సంస్థ తెలిపింది. పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ ఆన్‌లైన్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఈ దాడిలో పరిమిత నష్టం మాత్రమే జరిగిందని పేర్కొంది. సంబంధిత అధికారులు వెంటనే అత్యవసర చర్యలు చేపట్టారని, మంటలను అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బందిని మోహరించారని ఆ సంస్థ ప్రతినిధి అబ్దుల్లా అల్-రాజీ తెలిపారు. మరోవైపు కువైట్ లో డ్రోన్ శకలాలు విద్యుత్ లైన్లను తాకడంతో పాక్షిక విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ప్రతిచర్యల సమయంలో కూలిపోయిన డ్రోన్ అవశేషాల వల్ల ఏడు ఓవర్‌హెడ్ విద్యుత్ ప్రసార లైన్లు దెబ్బతిన్నాయని విద్యుత్, జల మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో నాలుగు నుంచి ఆరు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం అంతరాయం కలిగిన సరఫరా మధ్యాహ్నానికి పాక్షికంగా పునరుద్ధరించబడింది. ప్రభావిత ప్రాంతాలను భద్రపరిచిన తర్వాత నష్టాన్ని అంచనా వేయడానికి సాంకేతిక బృందాలు రంగంలోకి దిగాయి. అత్యవసర మరమ్మతులు కొనసాగుతున్నాయని మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు. విద్యుత్ సేవలను త్వరగా పునరుద్ధరించేందుకు 24 గంటల అత్యవసర బృందాలు పనిచేస్తున్నాయని అధికారులు వెల్లడించారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయిల్ మధ్య నెల రోజులుగా సాగుతున్న యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త వ్యూహాలతో ముందుకు వచ్చారు. ఒకవైపు ట్రంప్ మధ్యప్రాచ్యాన్ని యుద్ధభూమిగా మార్చడానికి ప్రయత్నిస్తుండగా, మరోవైపు దౌత్యవేత్త ముసుగు ధరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా, అమెరికాతో ఎలాంటి చర్చలు జరగలేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు.

## ఇరాన్ నూతన సెక్యూరిటీ చీఫ్‌గా జోల్ఘద్ర్ నియామకం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కొత్త కార్యదర్శిగా మాజీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) కమాండర్ మొహమ్మద్ బాఘెర్ జోల్ఘద్ర్ నియమితులయ్యారు. ఇజ్రాయెల్ దాడిలో మృతి చెందిన అలీ లారిజానీ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇస్లామిక్ నాయకుడు మొజ్తబా ఖమేనీ ఆమోదంతో అధ్యక్ష ఉత్తర్వు మేరకు ఈ నియామకం జరిగినట్లు ప్రభుత్వ మీడియా వెల్లడించింది. జోల్ఘద్ర్‌కు ఐఆర్‌జిసి, బసిజ్, న్యాయవ్యవస్థలో విశేష అనుభవం ఉంది. ఇరాన్-అమెరికా, ఇజ్రాయిల్ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా మండలి నిర్ణయాలలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. ఆయన గతంలో పారామిలిటరీ సంస్థ అయిన బసిజ్ కోసం సాయుధ దళాల జనరల్ స్టాఫ్ డిప్యూటీ చీఫ్‌గా పనిచేశారు మరియు న్యాయవ్యవస్థలో ఉన్నత పదవులను నిర్వహించారు. 2023లో ఇబ్రహీం రైసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ఆయన శక్తివంతమైన ఎక్స్‌పీడియన్సీ కౌన్సిల్‌కు కార్యదర్శి అయ్యారు.

## లెబనాన్‌లో కొనసాగుతున్న ఇజ్రాయిల్ నరమేధం

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ లెబనాన్‌లో ఇజ్రాయిల్ నరమేధం కొనసాగుతోంది. దక్షిణ లెబనాన్‌లోని నివాస ప్రాంతాలు, శరణార్థి శిబిరాలపై జరిగిన వైమానిక దాడుల్లో చాలా మంది మరణించారు. లెబనీస్ నేషనల్ న్యూస్ ఏజెన్సీ విడుదల చేసిన సమాచారం ప్రకారం, మహిళలు, పిల్లలను కూడా సామూహికంగా హతమారుస్తున్నారు. సిడాన్ సమీపంలోని మిహ్ మిహ్ శరణార్థి శిబిరంలోని ఒక ఫ్లాట్‌ను లక్ష్యంగా చేసుకుని జరిగిన బాంబు దాడిలో ఇద్దరు విషాదకరంగా మరణించారు. శాంతియుతంగా జీవిస్తున్న శరణార్థి కుటుంబాలపై జరిగిన ఈ దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రజలను చంపి, భయాన్ని వ్యాపింపజేయాలనే ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం లెబనాన్‌లో కూడా కొనసాగుతోందని స్పష్టమవుతోంది. మార్చి 2 నుంచి ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో కనీసం 1,072 మంది మరణించగా, మరో 2,966 మంది గాయపడ్డారని లెబనీస్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇటీవల పేర్కొంది. సిడాన్ జిల్లాలోని అడ్లౌన్ పట్టణంలో ఇజ్రాయిల్ జరిపిన మరో వైమానిక దాడిలో నలుగురు మరణించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి చాలా విషమంగా ఉంది. దీని తర్వాత కొద్దిసేపటికే, నబాటియా జిల్లాలోని హబూష్ పట్టణంలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో ముగ్గురు మరణించినట్లు నివేదికలు వచ్చాయి.

# పాలస్తీనియన్లను హింసించేందుకు ఇజ్రాయిల్‌కు ప్రపంచం లైసెన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** పాలస్తీనియులను హింసించడానికి ఇజ్రాయిల్‌కు ప్రపంచం అధికారమిచ్చిందన్నట్లు వ్యవహరిస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలస్తీనా భూభాగంలో పాలస్తీనియన్లపై నిరంతరం హింస సాగుతోందని, ఇది శారీరక, మానసిక రూపాల్లో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1967 నుండి ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో హక్కులపై యుఎన్ ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరిస్తున్న ఫ్రాన్సెస్కా అల్బనీస్ సోమవారం యుఎన్‌హెచ్‌ఆర్‌సిలో "హింస, జాతినిర్మూలన' అనే పేరుతో తాజా నివేదికను ప్రదర్శించారు. 'ఒకప్పుడు గోప్యంగా జరిగిన దాడులు, ప్రస్తుతం బహిరంగంగా కొనసాగుతున్నాయి. అత్యున్నత రాజకీయస్థాయిలో ఆమోదం పొందిన వ్యవస్థీకృత అమానుషం, బాధ, అవమానపాలన కొనసాగుతోంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "హింస కేవలం జైలు గోడలు, విచారణ గదులకే పరిమితం కాలేదని' ఇజ్రాయిల్ చేస్తున్న హింస ప్రభుత్వ విధానంగా మారిపోయిందని అన్నారు. దీనికి ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రభుత్వాలు, మంత్రులు మద్దతు తెలపడంతో ఇజ్రాయిల్‌కు పాలస్తీనియన్లను హింసించడానికి అనుమతి లభించినట్లైందని అన్నారు. సామూహికం నిర్బంధం, మానవతాసాయం,

ఆహారాన్ని అనుమతించకపోవడం, విశృంఖలంగా కొనసాగుతున్న సైనిక దురాక్రమణ, పాలస్తీనా ప్రజలపై హింస, అణువణువునా నిఘా, దాడులతో ఆక్రమిత పాలస్తీనా భూభాగం ఒక సామూహిక శిక్షా కేంద్రంగా మారిందని అన్నారు.

# శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ పోరాడతాం



**హైదరాబాద్ పెన్ పవర్:** యుద్ధం ముగించే విషయంపై చర్చలు కొనసాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొంటుండగా.. ఇరాన్ అధికారుల నుంచి వస్తున్న వ్యాఖ్యలు అందుకు భిన్నంగా ఉన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ చేసిన దురాక్రమణకు.. వారు పశ్చాత్తాప పడేవరకూ తమ ప్రతీకార దాడులు కొనసాగుతూనే ఉంటాయని తాజాగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ తో ఆయన చర్చించారు. ఈ క్రమంలోనే అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఇరాన్ పౌర, రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయడమే.. ఈ ప్రాంతంలో అస్థిరతకు కారణమని అరాగ్చీ పేర్కొన్నారు. తమ లక్ష్యాలన్నీ నెరవేరి.. హింసాత్మక దురాక్రమణకు పాల్పడినందుకు గాను శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు కొనసాగుతాయన్నారు. తమ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడం తమ మొదటి ప్రాధాన్యం అని వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో సహా తాము తీసుకున్న చర్యలన్నీ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయన్నారు. ఇదిలాఉండగా..

అమెరికా- ఇరాన్ మధ్య దౌత్య చర్చలకు అడుగులు పడుతుండగా.. కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో పాటు పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్‌కు అమెరికా- ఇజ్రాయెల్ తాత్కాలిక రక్షణ కల్పించాయి. చర్చలు కొనసాగుతున్నంతకాలం ఈ రక్షణ ఉంటుందని ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

# ఆ భవనం ఖాళీ చేయండి.. కాంగ్రెస్ పార్టీకి నోటీసులు జారీ



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేయాలని ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలోని 24 అక్బర్ రోడ్డులో ఉన్న ఆఫీసును మార్చి 28వ తేదీ లోగా ఖాళీ చేయాలని నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది.దాదాపు 48 ఏళ్ల పాటు అక్బర్ రోడ్డులోని భవనం కాంగ్రెస్ పార్టీకి ప్రధాన కార్యాలయంగా సేవలు అందించింది. కోట్లా మార్గ్‌లో గత ఏడాది కాంగ్రెస్ పార్టీ కొత్త భవనాన్ని ప్రారంభించింది. ఇందిరా భవన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యాలయాన్ని స్టార్ట్ చేసింది. అయితే ఈ నేపథ్యంలో అక్బర్ రోడ్డులో ఉన్న ఆఫీసును ఖాళీ చేయాలని ప్రభుత్వం నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అక్బర్ రోడ్డు బిల్డింగ్ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంగా చాన్నాళ్లు పనిచేసింది. కొత్త ఆఫీసును ఓపెన్ చేసినా.. ఇంకా పాత కార్యాలయాన్ని వాడడం పట్ల ఆరోపణలు వస్తున్నాయి. అక్బర్ రోడ్డులో ఉన్న ఆఫీసుకు పెద్ద చరిత్రే ఉన్నది. రాజకీయంగా, చరిత్రాత్మకంగా ఆ బిల్డింగ్‌కు చాలా ప్రాముఖ్యత ఉన్నది. స్వాతంత్ర్యం రావడానికి ముందు ఆ ప్రాపర్టీని బ్రిటీష్ వైస్‌రాయ్ సర్ రెజినాల్డ్ మ్యాక్స్‌వెల్ నివాసంగా వాడుకున్నారు. మయన్మార్ అంబాసిడర్ దా ఖిన్ కియా నివాసంగా కూడా వినియోగించారు. ఈ ఇంట్లోనే ఆయన కూతురు ఆంగ్‌సాన్ సూకీ కూడా తన బాల్యాన్ని గడిపారు. ఇక 1977లో ఓటమి తర్వాత ఇందిరా గాంధీ ఈ బిల్డింగ్ నుంచి మళ్లీ తన సమరాన్ని కొనసాగించారు. ఆ తర్వాత ఆ బిల్డింగ్.. పార్టీ ప్రధాన కార్యాలయంగా కొనసాగింది. రాజీవ్ గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్ సింగ్ కూడా ఈ కార్యాలయం నుంచే ఎదిగారు.

# పురుషులకూ ఉచిత బస్ ప్రయాణం



**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే నెలలో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విపక్ష ఏఐఏడీఎంకే ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసి ఓటర్లపై వరాలు జల్లు కురిపించింది. 2026లో తాము అధికారంలోకి వస్తే అన్ని బియ్యం క్యాటగిరీ రేషన్‌కార్డు దారులకు ఒక రిఫ్రిజిరేటర్‌ను ఉచితంగా అందజేస్తామని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి కె పళనిస్వామి ప్రకటించారు. మహిళల మాదిరిగానే పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం అందిస్తామని హామీనిచ్చారు. అంతేకాకుండా రేషన్‌కార్డుదారులకు ఒక కిలో పప్పు, ఒక లీటర్ వంటనూనె ఉచితంగా ఇస్తామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న పన్నులు, ధరల పెరుగుదలను తట్టుకునేందుకు ప్రతి కుటుంబానికీ 10,000 నగదును ఏడాదికి ఒకసారి అందజేస్తామని, రూ. 25 వేల రాయితీతో 5 లక్షల మంది మహిళా ఉద్యోగులకు ద్విచక్ర వాహనాలు అందిస్తామని తెలిపారు. అలాగే ప్రతి ఏడాదీ మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తామని, జల్లికట్టులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని, బ్యాంకుల నుంచి తీసుకున్న విద్యా రుణాలు మాఫీ చేస్తామని, సామాజిక భద్రతా పింఛన్‌ను రూ.2 వేలకు పెంచుతామని ఏఐఏడీఎంకే తన మ్యానిఫెస్టోలో ప్రకటించింది.

## కొలంబియా విమాన ప్రమాదంలో మృతులు 66 మంది

**హైదరాబాద్ పెన్ పవర్:** కొలంబియాలో సైనిక విమానం కూలిన ఘటనలో 66 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో గాయపడగా, నలుగురు సైనికుల ఆచూకీ తెలియాల్సి ఉందని కొలంబియా సాయుధ దళాల అధిపతి జనరల్ హుగో అలెజాండ్రో లోపేజ్ బారెటో వెల్లడించారు. ప్రమాదానికి గురైన లాక్‌హీడ్ మార్టిన్ హెర్క్యులస్ సీ-130 రవాణా విమానంలో 128 మంది ఉన్నట్లు అధికారులు మంగళవారం ధ్రువీకరించారు. వీరిలో 115 మంది సైనికులు, 11 మంది విమాన సిబ్బంది, ఇద్దరు పోలీసులు ఉన్నారని వెల్లడించారు. వీరిలో 66 మంది దుర్మరణం పాలవగా, గాయపడిన 58 మందిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. విమానంలో తరలిస్తున్న మందుగుండు సామగ్రి పేలి ప్రమాద తీవ్రత మరింత పెరిగిందని కొలంబియా రక్షణ మంత్రి పెడ్రో సాంచెజ్ వెల్లడించారు. ఇది ఉగ్రవాదుల దాడి కాదని, టేకాఫ్‌కు ముందు విమానం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉందని ఆయన స్పష్టంచేశారు. ఈ ప్రమాదంపై కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్రద్గ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## త్వరలో ఔషధ ధరలకు రెక్కలు?

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మెల్లిమెల్లిగా ప్రపంచమంతా విస్తరిస్తున్నది. యుద్ధం కారణంగా ఇప్పటివరకు భారత్‌లో వంటగ్యాస్, చమురు, ఎరువులకు విస్తరించిన కొరత ఇప్పుడు ఔషధ పరిశ్రమపై కూడా పడనుంది. యుద్ధ ప్రభావం భారత మందుల సరఫరా చైన్‌పై పడటంతో ముఖ్యమైన ఔషధాల ముడి సరుకు ధరలు కేవలం 15 రోజుల వ్యవధిలోనే 200 నుంచి 300 శాతం పెరిగాయి. దీంతో దేశంలో ఆయా మందుల ధరలు పెరగడమే కాక, వాటికి కొరత కూడా ఏర్పడే అవకాశం ఉంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) ఔషధ పరిశ్రమలు 500కు పైగా ఉండే హిమాచల్ ప్రదేశ్‌లోని డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఈ మేరకు ఈ విషయాన్ని వెల్లడిస్తూ.. కేంద్ర ఆరోగ్య శాఖకు సోమవారం ఒక లేఖ రాసింది. ఈ విషయంలో కేంద్రం అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. భారత్‌లో ఇంచుమించు ప్రతి ఇంట్లో వాడే పారాసిట్‌మాల్ తయారీలో వాడే ముడి సరుకు ధర 15 రోజుల వ్యవధిలో కేజీ రూ. 250 నుంచి రూ.450కు చేరుకుంది. మిగతా ముడి పదార్థాలది ఇదే తీరని, ఈ ధరలు ఇలాగే కొనసాగితే ప్రస్తుత ధరలకే తాము మందులను తయారు చేయలేమని, ధరలను పెంచక తప్పదని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు శర్మ తెలిపారు.

## తగినన్ని ఇంధన నిల్వలు ఉన్నాయి

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఏర్పడిందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో పశ్చిమాసియా యుద్ధంపై ఓ ప్రకటన చేసిన ప్రధాని.. యుద్ధం కారణంగా భారత్‌లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా మారిందని చెప్పారు. అయితే ప్రస్తుతం దేశంలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని ఆయన ప్రకటించారు. హ్వార్మూజ్ నుంచి వచ్చే చమురు నౌకలను సురక్షితంగా మన రేవులకు చేరేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని మోదీ తెలిపారు. యుద్ధం వల్ల సంభవించే దీర్ఘకాలిక పరిణామాలను ఎదుర్కొనడానికి ఏడు సాధికారత బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించారు. ఈ సంక్షోభాన్ని నివారించడానికి టీమ్ ఇండియా స్ఫూర్తితో కేంద్రంతో కలసి పనిచేయాలని రాష్ట్రాలను కోరారు. పశ్చిమాసియాలో పరిస్థితి ఎప్పటికప్పుడు మారిపోతున్నదని, దాని దుష్ప్రభావాలు దీర్ఘకాలం ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు పిలుపునిస్తూ యుద్ధం వల్ల సంభవించే దుష్ప్రభావాలను వివరించారు. కొవిడ్ మహమ్మారి సందర్భంగా ఆనాడు తలెత్తిన సవాళ్లను ఎదుర్కొనడానికి నిపుణులతో కూడిన సాధికార బృందాలు చేసిన కృషిని ఆయన గుర్తు చేస్తూ ఈ యుద్ధం వల్ల సంభవించే పర్యవసనాలను ఎదుర్కొనడానికి ఏడు సాధికారత బృందా లు ఇంధనం, ఎరువులు, గ్యాస్, సరఫరా గొలుసులు, ద్రవ్యోల్బణంపై వ్యూహాలను రచిస్తాయని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు చర్చలు, దౌత్యమే ఏకైక పరిష్కారాలన్న భారత్ వైఖరిని ప్రధాని పునరుద్ఘాటించారు.

# ఫిలిప్స్ వన్ చెఫ్ విడుదల

భారతీయ గృహాలకు పాకశాస్త్ర అవకాశాల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ, రోజువారీ వంటను సులభతరం చేయడానికి రూపొందించిన వినూత్నమైన ఆల్-ఇన్-వన్ స్మార్ట్ కుకింగ్ ఉపకరణం అయిన ఫిలిప్స్ వన్ చెఫ్ ను విడుదల చేస్తున్నట్టు ఫిలిప్స్ హోమ్ అప్లయన్సెస్ వెల్లడించింది. ముంబైలో, రణ్ వీర్ బ్రార్ పర్యవేక్షణలో జరిగిన ఒక అనుభవపూర్వకమైన చెఫ్స్ టేస్టింగ్ టేబుల్ కార్యక్రమంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథులను లైవ్ టేస్టింగ్స్, ఇంటరాక్టివ్ ఫుడ్ స్టేషన్ల ద్వారా భారతదేశంలోని విభిన్న వంట రుచులను అన్వేషించడానికి ఆహ్వానించారు. ఈసందర్భంగా గుల్బహార్ తౌరానీ మాట్లాడుతూ? వెర్సుని వద్ద భారతీయ కుటుంబాలు వాస్తవానికి ఎలా వంట చేస్తాయో అర్థం చేసుకోవడం, వారి రోజువారీ వంటలలో సహజంగా ఇమిడిపోయే ఉపకరణాలను రూపొందించడంపైనే తమ లక్ష్యం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. భారతీయ వంటకాలు చాలా వైవిధ్యమైనవి, తరచుగా ఎక్కువ సమయం తీసుకుంటాయన్నారు. అందుకే రుచిలో రాజీపడకుండా వంట ప్రక్రియలను సులభతరం చేసే పరిష్కారాలు రోజురోజుకూ ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నా యన్నారు. భారతీయ వంటకాలు ఎంతో వైవిధ్యభరితంగా, విభిన్నంగా ఉంటాయన్నారు. రుచి పరంగా ఎలాంటి రాజీపడకుండా వాటిని మరింత సులభంగా



అందుబాటులోకి తీసుకురావడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించగలదన్నారు. ఆ సమతుల్యతను తీసుకురావడానికే వన్ చెఫ్ రూపొందించబడింది. ఇది ఇళ్లలో వంటి చేసే వారికి అనేక రకాల వంటకాలను మరింత సులభంగా, ఆత్మవిశ్వాసంతో అన్వేషించడంలో సహాయపడుతుందని చెఫ్ రణ్ వీర్ బ్రార్ అన్నారు.

# దేశ జీడీపీ డౌన్!..
# ఈసారి 5.9 శాతానికే పరిమితం




ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్పీజీ, ఎల్ఎన్జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది.

2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి (60 బేసిస్ పాయింట్లు) పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హ్పార్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది.

# ఇరాన్ నుంచి 5 మిలియన్ బ్యారెళ్ల చమురు కొన్న రిలయన్స్

ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీ కాంప్లెక్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇరాన్ నుండి సుమారు 50 లక్షల బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసింది. 2019లో అమెరికా ఆంక్షల కారణంగా ఇరాన్ నుండి చమురు దిగుమతులను భారత్ నిలిపివేసింది. అయితే ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడింది. ఈ సంక్షోభాన్ని నివారించడానికి, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలను అదుపు చేయడానికి అమెరికా ప్రభుత్వం ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను 30 రోజులపాటు తాత్కాలికంగా సడలించింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న రిలయన్స్, నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ(ఎన్ఐఓసీ)తో ఈ భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ఆర్థికంగానూ, సాంకేతికంగానూ రిలయన్స్‌కు ఎంతో లాభదాయకం. ఇరాన్ ముడి చమురు నాణ్యత జామ్‌నగర్ రిఫైనరీలోని అత్యాధునిక యంత్రాలకు అత్యంత అనుకూలంగా




ఉంటుంది. దీనివల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇంధనాన్ని ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 నుండి 120 డాలర్ల మధ్య ఉండగా, రిలయన్స్ సుమారు 7 డాలర్ల ప్రీమియంతో ఈ డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా చమురుపై భారత్ ఏ విధంగా ఆధారపడిందో, ఇప్పుడు ఇరాన్ చమురు దిగుమతుల పునఃప్రారంభం ద్వారా భారత్ తన ఇంధన వనరులను వివిధ దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇది కేవలం రిలయన్స్‌కే కాకుండా, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల స్థిరీకరణకు కూడా పరోక్షంగా దోహదపడే అవకాశం ఉంది.

## ఎసి ధరలకు పశ్చిమాసియా సెగ..!




పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధాల వల్ల ఎసి ధరలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. సరఫరా తగ్గడం, ముడి సరుకుల ధరలు పెరగడంతో వచ్చే కొద్ది రోజుల్లోనే వినియోగదారులపై భారం పడొచ్చని భావిస్తున్నారు. ప్రముఖ ఎసి ఉత్పత్తుల కంపెనీ బ్లూ స్టార్ నివాస, వాణిజ్య కూలింగ్ విభాగాలలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోనున్నట్లు మంగళవారం ప్రకటించింది. హైదరాబాద్‌లో బ్లూస్టార్ వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ గిరీష్ హింగోరని, ఆ గ్రూప్ ప్రెసిడెంట్ మోహిత్ సుద్ ఆ కంపెనీ ప్రీమియం శ్రేణీ ఐకోనియా ఉత్పత్తులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఇప్పుడు 125 రకాల రూమ్ ఎయిర్ కండీషనర్ మోడళ్లు ఉన్నాయన్నారు. ఇందులో వినియోగదారుల అవసరాలకు, వివిధ రకాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఫ్లాగ్‌షిప్ ప్రీమియం శ్రేణి ఐకోనియా కూడా ఉందన్నారు. ప్రస్తుతం 1.4 కోట్ల యూనిట్లుగా ఉన్న ఎసి మార్కెట్.. 2030 నాటికి 3 కోట్ల యూనిట్లకు విస్తరిస్తుందని అంచనా వేశారు. ఎసి పరిశ్రమ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధరలు 7 నుంచి 8 శాతం వరకు పెరగనున్నట్లు గిరీష్, మోహిత్ సుద్ తెలిపారు. ప్రధానంగా రాగి అల్యూమినియం, స్టీల్ వంటి ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం దాదాపు 8.5 శాతం అధికమైందన్నారు.. దీనికి తోడు కొత్త ఇంధన సామర్థ్య నిబంధనల ప్రకారం తయారీలో మార్పులు చేయాల్సి రావడంతో మరో 4 శాతం అదనపు భారం పడిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ప్లాస్టిక్ విడిభాగాలకు అవసరమైన ఆయిల్, ఎల్ఎన్‌జి లభ్యత తగ్గడం కూడా ఈ సంక్షోభానికి ప్రధాన కారణమన్నారు. ఈ భారాన్ని అప్పుడే వినియోగదారులపై మోపే అవకాశాలు లేవన్నారు.

## చమురు 150 డాలర్లకు చేరితే..
## మాంద్యంలోకి ప్రపంచం..!



చమురు ధరలు 150 డాలర్లకు చేరితే ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెళ్తుందని అమెరికా అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్ సీఈవో లారీ ఫింక్ హెచ్చరించారు. ఇరాన్ ముప్పు కొనసాగి.. చమురు ధరలు పెరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పశ్చిమాసియాలో ప్రస్తుత ఘర్షణలు చివరకు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయనే దానిపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటే అవుతుందని ఫింక్ అన్నారు. "ఘర్షణలు ముగిసి, ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇరాన్ (ఎతీజీని)ను ప్రపంచం ఆమోదిస్తే.. చమురు ధరలు యుద్ధం ముందు నాటికంటే దిగువకు పడిపోతాయి. అలాకాకుండా వార్ కొనసాగి, ఆ ధరలు 100 డాలర్లకు పైగా.. 150 డాలర్లకు చేరువగా సుదీర్ఘకాలం ఉంటే.. ప్రపంచ ఆర్థికవ్యవస్థపై పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చు" అని అంచనా వేశారు.

## షాకిచ్చిన బంగారం, వెండి ధరలు



గత వారం రోజులుగా బంగారం ధరలు వరుసగా పతనమవుతూ, కొనుగోలుదారులలో ఆశలు రేకెత్తించాయి. 10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు పడిపోతుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో, బుధవారం ఉదయం ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.3760 పెరిగి రూ.1,46,670కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.3450 పెరిగి రూ.1,34,450కి ఎగబాకింది. నేడు బంగారం కొనుగోలు చేసేవారికి ఇది అదనపు భారమనే చెప్పాలి. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. కిలో వెండిపై రూ.10,000 పెరగ్గా.. నేటి ధర రూ.2,60,000 గా ఉంది. ప్రపంచ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు ఆకస్మికంగా పెరగడం, డాలర్ బలహీనపడటమే దీనికి ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై వస్తున్న తాజా వార్తలు పెట్టుబడిదారులను బంగారం వైపు మళ్లించాయి. దీనికి తోడు దేశీయంగా వివాహాల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, రూపాయి మారకం విలువలో మార్పులు కూడా ఈ పెరుగుదలకు కారణాలుగా కనిపిస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. బంగారం, వెండి ధరల పెరుగుదల తాత్కాలికమేనా లేక రాబోయే రోజుల్లో కూడా కొనసాగుతుందా అనేది వేచి చూడాలి.

# ఉల్లిపాయలను ఇలా తింటే ప్రయోజనం



మనం వంటలో ఉల్లిపాయలను ఏదో ఒక రూపంలో ఉపయోగిస్తాము. అవి వంటకు రుచిని జోడించడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మంచిగా పనిచేస్తాయి.. సాధారణంగా, వంటలలో వాటిని ఉపయోగించేటప్పుడు, మనం ఉల్లిపాయలను ఉడికించి లేదా వేయించి, ఆ తర్వాత వంటలో వాడతాము. కానీ, ఉల్లిపాయలను పచ్చిగా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు మీకు తెలుసా? ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు.. ఎందుకంటే.. ఉల్లిపాయల్లో ఎన్నో ఔషధ గుణాలు, పోషకాలు దాగున్నాయి.. పచ్చి ఉల్లిపాయలోని యాంటీఆక్సిడెంట్లు, సల్ఫర్ సమ్మేళనాలు, విటమిన్లు రోగనిరోధక శక్తిని పెంచి ఎన్నో సమస్యలను నివారిస్తాయి.. అందుకే.. పచ్చి ఉల్లిని మన ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. వాస్తవానికి మనం మన రోజువారీ వంటల్లో ఉల్లిపాయలను ఏదో ఒక రూపంలో ఉపయోగిస్తాము. అవి మన వంటలకు రుచిని జోడించడమే కాకుండా, మన ఆరోగ్యానికి కూడా చాలా మంచివి. సాధారణంగా, వంటకాల్లో వాటిని ఉపయోగించేటప్పుడు, మనం వాటిని ఉడికించి లేదా వేయించి, ఆ తర్వాత వంటలో వాడతాము. కానీ, ఉల్లిపాయలను పచ్చిగా తినడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. మధుమేహం లేదా ప్రీ-డయాబెటిస్‌ను తగ్గించడానికి ఉల్లిపాయలను ప్రతిరోజూ తినవచ్చు. ఉల్లిపాయలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి చాలా మంచివి.పచ్చి ఉల్లిపాయలలో ఉండే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది కాకుండా, ఇందులో ఫ్లేవనాయిడ్ అనే యాంటీఆక్సిడెంట్ కూడా ఉంటుంది.. ఇది కూడా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి..పచ్చి ఉల్లిపాయలలో ఇతర పోషకాలతో పాటు పీచుపదార్థం కూడా పుష్కలంగా ఉంటుంది. పేగుల ఆరోగ్యానికి అత్యవసరమైన పీచుపదార్థం.. ప్రీబయోటిక్స్‌కు ఉల్లిపాయలు ఒక అద్భుతమైన మూలంగా పరిగణిస్తారు.ఉల్లిపాయల్లోని ఔషధ గుణాలు.. జలుబు-దగ్గును తగ్గిస్తాయి.. అలాగే.. చర్మ, కేశ సంరక్షణకు సైతం మేలు చేస్తాయి. ఉల్లిపాయలు పొట్ట ఆరోగ్యానికి చాలా మంచివి.. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో బాగా సహాయపడతాయి. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల శరీరంలో జీర్ణక్రియ మెరుగుపడి.. మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది.

# ఒంట్లోకి వెళ్తే ఆరోగ్యానికి దివ్యౌషధాలు!



తక్కువ ధరలో లభించే కొత్తిమీర ఆహారం రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. కొత్తిమీరలో విటమిన్లు ఎ, సి, కె, ఖనిజాలు, పీచుపదార్థం పుష్కలంగా ఉంటాయి. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా తక్కువగా ఉంటుంది. ఆహారానికి రుచిని, సువాసనను పెంచడంలో కొత్తిమీరకు మించిన ఆప్షన్ లేదు. తక్కువ ధరలో లభించే ఈ ఆకుకూర ఆహారం రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. కొత్తిమీరలో విటమిన్లు ఎ, సి, కె, ఖనిజాలు, పీచుపదార్థం పుష్కలంగా ఉంటాయి. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా తక్కువగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మైగ్రేన్లు, తలనొప్పులు, థైరాయిడ్, మధుమేహం, కొలెస్ట్రాల్, అజీర్ణం, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అనేక వ్యాధులను నయం చేయడంలోనూ కొత్తిమీర సహాయపడుతుంది.మధుమేహంతో బాధపడేవారికి కొత్తిమీర ఔషధం లాంటిది. దీని ఆకుల్లో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో చురుకైన పాత్ర పోషించే ప్రత్యేక సహజ ఎంజైమ్‌లు ఉంటాయి. ఇందులో సహజ పీచుపదార్థం పుష్కలంగా ఉంటుంది. ఇది ఆహారాన్ని నెమ్మదిగా జీర్ణం చేసి, చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నివారిస్తుంది. మీరు కావాలనుకుంటే, కొత్తిమీర ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి ఆ నీటిని ఉదయాన్నే తాగవచ్చు. కొత్తిమీరలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి వ్యాధులతో పోరాడే శక్తిని ఇస్తాయి. ఇవి హానికరమైన సూక్ష్మజీవులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడటానికి శరీరానికి సహాయపడతాయి. ఇది శరీర కణాలకు నష్టం జరగకుండా నివారిస్తుంది. దీంతో చాలా కాలం పాటు ఆరోగ్యంగా ఉంచుతుంది.కడుపులో పైత్యరసం లేదా ఆమ్లత్వం పెరిగితే దాని ప్రత్యక్ష ప్రభావం ముఖంపై కనిపిస్తుంది. దీనివల్ల మొటిమలు, దద్దుర్లు వంటి సమస్యలు వస్తాయి. కొత్తిమీర ఆకులకు చల్లదనాన్నిచ్చే గుణం ఉన్నందున అవి శరీరంలోని అధిక ఆమ్లాన్ని, పైత్యరసాన్ని శాంతపరుస్తాయి. ఇది శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది. ముఖంపై ఉన్న మచ్చలను తొలగిస్తుంది.కొత్తిమీరలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణ వ్యవస్థను బలంగా, కడుపును తేలికగా ఉంచుకోవాలనుకుంటే మీ రోజువారీ ఆహారంలో కొద్దిగా కొత్తిమీరను చేర్చుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. కొత్తిమీర సహజ మూత్రవర్ధకంగా పనిచేసి, శరీరం నుంచి అదనపు సోడియంను బయటకు పంపడానికి సహాయపడుతుంది. ఇది రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం కొత్తిమీరను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించవచ్చని తేలింది. కొత్తిమీర ఆకులు చర్మానికి, జుట్టుకు చాలా మేలు చేస్తాయని భావిస్తారు. వీటిలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు జుట్టును ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కాపాడతాయి. జుట్టు రాలడాన్ని నివారిస్తాయి. జుట్టును బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

# బీట్‌రూట్..ఈ సమస్యలు ఉన్నవారు తాగితే రిస్క్



బీట్‌రూట్.. పోషకాల గని. ఇందులో ఉండే ఫోలేట్, పొటాషియం, విటమిన్-సి వంటి పోషకాలు శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. రక్తాన్ని పెంచడానికి, చర్మాన్ని మెరుగుపరచడానికి చాలా మంది బీట్‌రూట్ జ్యూస్‌ను క్రమం తప్పకుండా తీసుకుంటారు. అయితే ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ పోషకమైన జ్యూస్ అందరికీ సరిపడదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇది ప్రయోజనానికి బదులుగా హాని కలిగించే అవకాశం ఉంది. కిడ్నీలో రాళ్ల సమస్య : ఎవరికైతే కిడ్నీలో రాళ్లు ఉన్నాయో లేదా గతంలో ఆ సమస్యతో బాధపడ్డారో, వారు బీట్‌రూట్ జ్యూస్ తాగకపోవడమే మంచిది. బీట్‌రూట్‌లో ఆక్సలేట్ అనే మూలకం అధికంగా ఉంటుంది. ఇది కిడ్నీలో రాళ్ల సమస్యను మరింత తీవ్రతరం చేయడమే కాకుండా, కొత్తగా రాళ్లు ఏర్పడటానికి కారణమవుతుంది. తక్కువ రక్తపోటు: బీట్‌రూట్ సహజంగానే రక్తపోటును తగ్గించే గుణాన్ని కలిగి ఉంటుంది. ఇది హై బీపీ ఉన్న రోగులకు వరప్రసాదం లాంటిది. కానీ, ఇప్పటికే లో బీపీతో బాధపడేవారు దీనిని తీసుకుంటే రక్తపోటు మరింత పడిపోయి, నీరసం లేదా కళ్లు తిరగడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. బలహీనమైన జీర్ణశక్తి: తరచుగా కడుపు నొప్పి, గ్యాస్ లేదా ఉబ్బరం వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారు బీట్‌రూట్ రసానికి దూరంగా ఉండాలి. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణక్రియ మందగించి, కడుపులో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది.

అలర్జీ సమస్యలు: అలర్జీలు ఉన్నవారికి బీట్‌రూట్ రసం ఒక్కోసారి వికటించవచ్చు. దీనివల్ల చర్మంపై దురద, ఎర్రటి దద్దుర్లు లేదా చికాకు కలగవచ్చు. కొంతమందిలో వికారం లేదా వాంతులు వంటి దుష్ప్రభావాలు కూడా కనిపించవచ్చు. ఏదైనా అతిగా తీసుకుంటే అది హాని కలిగిస్తుందనేది మరువకూడదు. బీట్‌రూట్ జ్యూస్ మీ శరీరానికి సరిపడుతుందో లేదో తెలుసుకోవడానికి తక్కువ పరిమాణంలో ప్రారంభించడం లేదా మీ వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.

# ఆరోగ్యానికి ప్రకృతి ఇచ్చిన వరం



మారుతున్న జీవనశైలి, గంటల తరబడి కూర్చుని పనిచేయడం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల ప్రస్తుతం చాలా మంది ఎముకల సమస్యలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా 30 ఏళ్లు దాటిన తర్వాత ఎముకల సాంద్రత తగ్గడం ప్రారంభమై, అవి బలహీనపడే ప్రక్రియ వేగవంతమవుతుంది. దీనివల్ల కీళ్ల నొప్పులు, ఆస్టియోపొరోసిస్ వంటి వ్యాధుల ముప్పు పెరుగుతోంది. అయితే మన వంటింట్లో దొరికే మెంతులు ఈ సమస్యలకు అద్భుత పరిష్కారమని నిపుణులు చెబుతున్నారు. ఎముకలకు మెంతులు: నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ నివేదికల ప్రకారం.. మెంతులు ఎముకల ఆరోగ్యానికి ఒక శక్తివంతమైన ఔషధంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే పోషకాలు ఎముకలను దృఢంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మెంతుల్లో కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, ఇనుము పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముక సాంద్రతను పెంచి, విరిగే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఎముకలు విరిగినప్పుడు లేదా దెబ్బతిన్నప్పుడు.. అవి త్వరగా కోలుకోవడానికి మెంతులు సహాయపడతాయి. ఇందులోని శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ గుణాలు కీళ్లవాతం, కీళ్ల నొప్పి, వాపును తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఎలా తీసుకోవాలి?: ఎముకల బలాన్ని పెంచుకోవడానికి మెంతులను ఈ పద్ధతుల్లో తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒక టీస్పూన్ మెంతులను రాత్రంతా ఒక గ్లాసు నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే పరగడుపున ఆ నీటిని తాగి, గింజలను నమిలి తినడం వల్ల పూర్తి ప్రయోజనం లభిస్తుంది. అంతేకాకుండా మెంతులను దోరగా వేయించి, పొడిగా నూరి పెట్టుకోవాలి. ఈ పొడిని ప్రతిరోజూ ఉదయం గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవచ్చు. 30 ఏళ్లు దాటిన వారు: ఎముకలు బలహీనపడకుండా ఉండాలంటే కేవలం చిట్కాలు మాత్రమే సరిపోవు. మీ ఆహారంలో కాల్షియం మరియు విటమిన్ డి సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఉదయం పూట ఎండలో కాసేపు గడపడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎముకల ఆరోగ్యం కోసం మెంతులతో పాటు కాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం. ఏదైనా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుని సలహాతోనే ఈ మార్పులు చేసుకోవడం ఉత్తమం.

# మండే వేసవిలో పవర్‌ఫుల్ పండు



ఎండలు దంచికొడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు.. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం ఉత్తమం.. ముఖ్యంగా సరిపడినంత నీరు తాగడం అలాగే.. మంచి ఆరోగ్యకరమైన పండ్లు తీసుకోవడం ఉత్తమం.. అలాంటి అద్భుతమైన పండ్లలో కర్బూజ ఒకటి.. ఇది తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు..వేసవికాలం వచ్చేసింది.. ఎండలు దంచికొడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు.. డీహైడ్రేషన్ బారిన పడకుండా.. హైడ్రేషన్ గా ఉండేందుకు .. మంచి పండ్లను తీసుకోవడం మంచిది.. అలాంటి అద్భుతమైన పండ్లలో కర్బూజ ఒకటి.. ఇది వేసవిలో శరీరానికి అద్భుతమైన చలువ చేస్తుంది.. ఈ పండులో అధిక నీటి శాతం ఉంటుంది.. దీనిలో 90శాతానికి పైగా నీరు.. డీహైడ్రేషన్‌ను నివారించేలా సహాయపడుతుంది. శరీరంలోని వేడి తగ్గుతుంది: కర్బూజ అద్భుతమైన పండు.. ఇది వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, శరీరాన్ని చల్లబరుస్తుంది, ఎండదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది: కర్బూజను తీసుకుంటే.. రక్తపోటు అదుపులో ఉండటంతోపాటు.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.. దీనిలో ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో.. అలాగే రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో సహాయపడుతుంది. కడుపు సమస్యలకు చెక్: వేసవి కాలంలో తరచూ గ్యాస్, అజీర్తి, మలబద్దకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు బాధపడుతుంటారు.. అయితే, ఈ సీజన్‌లో సులభంగా జీర్ణమయ్యే కర్బూజను తినడం ద్వారా.. కడుపు సమస్యలకు చెక్ పెట్టవచ్చు.. కంటి ఆరోగ్యం: కర్బూజ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.. అలాగే.. కంటికి సంబంధించిన సమస్యలు కూడా దూరమవుతాయి.. దీనిలోని విటమిన్ ఎ బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతాయి.లైంగిక సమస్యలు: కర్బూజలో విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. అందువల్ల ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని రెగ్యులర్ గా తినడం వల్ల లైంగిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారు కర్బూజను తీసుకుంటే.. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.. అలాగే.. కర్బూజ బరువును తగ్గడంలో.. చర్మ ఆరోగ్యానికి బాగా సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు. అయితే.. ప్రతి రోజూ కర్బూజను తినడం వల్ల ఇలా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొంటున్నారు.

# చెరుకు, పుచ్చకాయ రసం.. సమ్మర్‌లో ఆరోగ్యానికి ఏది మంచిది..?



వేసవి కాలం తన ప్రతాపాన్ని చూపిస్తోంది. శరీరంలోని నీటి శాతం తగ్గిపోకుండా ఉండాలంటే కేవలం నీళ్లు తాగితే సరిపోదు, సరైన పోషకాలు కూడా అందాలి. మార్కెట్లో అందరికీ అందుబాటులో ఉండే చెరకు రసం తక్షణ శక్తిని ఇస్తుందా..? లేక 90శాతం నీటి శాతం ఉండే పుచ్చకాయ రసం దాహాన్ని తీరుస్తుందా? భానుడు భగభగమంటున్నాడు. మార్చి నెలలోనే ఎండలు ముదురుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శరీరంలోని నీటి శాతం తగ్గిపోకుండా కాపాడుకోవడానికి పానీయాల అవసరం పెరిగింది. అయితే మార్కెట్లో దొరికే కృత్రిమ కూల్ డ్రింక్స్ కంటే, పోషకాలు నిండిన సహజ రసాల వైపు మొగ్గు చూపాలని నిపుణులు సూచిస్తున్నారు. అందులో చెరుకు రసం, పుచ్చకాయ రసం బెస్ట్ అని చెప్పాలి.చెరకు రసం: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం.. చెరకు రసంలో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఎండలో తిరిగి అలసిపోయిన వారికి ఇది ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. పరిశోధనల ప్రకారం.. చెరకు రసాన్ని 35 నుండి 15 డిగ్రీల సెల్సియస్‌కు చల్లబరచి తాగడం వల్ల అందులోని పోషకాలు దెబ్బతినకుండా శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి. ఇందులోని పీచు పదార్థం వేసవిలో మందగించే జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయ రసం: కేవలం నీటి శాతం ఆధారంగా చూస్తే, పుచ్చకాయ రసం వేసవిలో అత్యంత అద్భుతమైన పానీయం. ఇందులో దాదాపు 90శాతం నీరు ఉంటుంది. విటమిన్ ఎ, సి మరియు లైకోపీన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఇందులో ఉంటాయి. శరీరానికి తేమను అందించి, దాహాన్ని తీర్చడంలో పుచ్చకాయ రసం ముందుంటుంది. ఇది వాపును తగ్గించి, చర్మ సౌందర్యానికి, గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఏది ఎంచుకోవాలి?: మీరు చేసే పనిని బట్టి ఎంపిక ఉండాలని న్యూట్రియెంట్స్ జర్నల్ పేర్కొంటోంది. ఎండలో శ్రమించే కార్మికులు లేదా ప్రయాణికులకు కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి చెరకు రసం ఉత్తమం. అధిక వేడి వల్ల ఒంట్లో నీరు తగ్గిపోయినట్లు అనిపిస్తే, తక్షణ హైడ్రేషన్ కోసం పుచ్చకాయ రసం బెస్ట్ ఛాయిస్. నిపుణుల సూచనలు: రసాన్ని తీసే విధానం వల్ల పోషకాలు దెబ్బతినకుండా ఉంటాయి. అయితే రసం తీసేటప్పుడు ఉపయోగించే నీటి నాణ్యత, పరిశుభ్రత చాలా ముఖ్యం. తక్షణ దాహం తీర్చుకోవడానికి ఎప్పుడూ శుభ్రమైన తాగునీటిని వెంట ఉంచుకోవాలి.

## వన్డే ప్రపంచకప్ జట్టులో టీ20 వరల్డ్ కప్ హీరోలకి నో ఛాన్స్.. ఏకంగా 8 మంది ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా, జింబాబ్వే మరియు నమీబియా సంయుక్త వేదికలలో జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. 2026 టీ20 వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి ట్రోఫీ గెలిచిన జోరులో ఉన్న టీమిండియా, వన్డే జట్టులో సమూల మార్పులు చేసేందుకు రెడీ అయింది. వన్డే క్రికెట్ లో ఓపికతో పాటు ఇన్నింగ్స్‌ను నిర్మించే వారిపై బీసీసీఐ మొగ్గు చూపుతోంది.

టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా ఆడిన సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్ లాంటి ప్లేయర్స్ కి 2027 వన్డే జట్టులో చోటు దక్కే అవకాశం కనిపించడం లేదు. వీరందరూ కేవలం టీ20 స్పెషలిస్టులుగానే ముద్రపడటం, వన్డే ఫార్మాట్‌కు అవసరమైన నిలకడ వీరిలో లేకపోవడంతో ఈ 8 మంది ఆటగాళ్ల ఎంపికపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కానీ, రాబోయే దేశవాళీ, ద్వైపాక్షిక సిరీస్‌లలో వీళ్లందరూ అద్భుతంగా రాణిస్తే తప్ప వన్డే జట్టులోకి పునరాగమనం చేయడం కష్టమే.

భవిష్యత్తు సారథిగా శుభ్‌మన్ గిల్‌ను రెడీ చేయాలని బీసీసీఐ సెలక్టర్లు భావిస్తున్నారు. గిల్ ఇప్పటికే తన బ్యాటింగ్, నాయకత్వ లక్షణాలతో ముందుకు నడుస్తున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో ఆశించిన ఫలితాలను రాబట్టకపోయినప్పటికీ, సుదీర్ఘ కాలం పాటు జట్టును నడిపించే సామర్థ్యం అతడికి ఉందని జట్టు యాజమాన్యం నమ్ముతుంది. ఓపెనర్‌గా శుభ్‌మన్ చేసే పరుగులు జట్టుకు అత్యంత కీలకం అయ్యే ఛాన్స్ ఉంది.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఫామ్ జట్టుకు ప్లస్ కానుంది. వన్డే ఫార్మాట్లో కోహ్లీ స్థిరత్వం, రోహిత్ దూకుడు 2027లోనూ టీమిండియాకు అవసరమని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. వీరిద్దరూ ఫిట్‌నెస్ కాపాడుకుంటే తుది జట్టులో ఉండటం పక్కా.. మరోవైపు కేఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా, జస్ప్రీత్ బుమ్రా ప్రధాన బౌలర్‌గా టీమ్ కి బ్యాక్ బోన్ లా నిలిచే అవకాశం ఉంది.

టీమిండియా 2027 వరల్డ్ కప్ జట్టు అంచనా: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా.

# 21 ఏళ్లకే క్రికెట్‌కి గుడ్ బై.. ఆర్సీబీ కొత్త ఛైర్మన్‌గా ఆర్యమన్ బిర్లా.. ఎలా సాధ్యమైందంటే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. క్రికెట్ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన టీమ్స్ లో ఒకటైన ఆర్సీబీ జట్టు చేతులు మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఆధ్వర్యంలోని కన్సార్టియం సుమారు 1.78 బిలియన్ డాలర్ల (రూ.16 వేల కోట్లకు)కి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. బ్రిటన్‌కు చెందిన డయాజియో అనుబంధ సంస్థ 'యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్' నుంచి ఆర్సీబీ 100 శాతం వాటాను ఈ కన్సార్టియం దక్కించుకుంది. ఈ భారీ ఒప్పందంతో ఐపీఎల్ జట్ల విలువ ఒక్కసారిగా భారీగా పెరిగిపోయింది. ఈ మార్పు తర్వాత ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమారుడు ఆర్యమన్ బిర్లా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కాగా ఆర్యమన్ బిర్లా కేవలం వ్యాపార కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినే కాదు.. అతడికి క్రికెట్‌తో సంబంధం కూడా ఉంది. మధ్యప్రదేశ్ తరఫున ఫస్ట్-క్లాస్ క్రికెట్ ఆడిన అనుభవం ఆర్యమన్ కి ఉంది. ఈడెన్ గార్డెన్స్‌లో బెంగాల్ టీమ్ పై సెంచరీ చేసిన చరిత్ర అతడి పేరిట నమోదైంది. ప్రస్తుతం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్‌తో కలిసి గతంలో అతడు డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నాడు. ఆర్సీబీ కొత్త ఛైర్మన్ ఆర్యమన్ బిర్లా ప్రయాణం చాలా ఇంట్రెస్టింగ్ గా కొనసాగింది. 2018 ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడ్ని రూ.30 లక్షలకు దక్కించుకుంది. కానీ అప్పుడు ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు.. దీంతో 2020లో తీవ్ర మానసిక ఒత్తిడితో క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతం ఇస్తూ తనను తాను అర్థం చేసుకోవడానికి ఆ బ్రేక్ తీసుకున్న ఆర్యమన్ బిర్లా.. ఇప్పుడు తన తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు నడిపిస్తున్నాడు. తాజాగా ఓ ఐపీఎల్ జట్టుని కొనుగోలు చేసి అధిపతిగా తిరిగి వచ్చాడు.

ఆర్సీబీ జట్టు కొనుగోలులో ద

ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, బోల్డ్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ పార్టనర్స్ గా ఉన్నాయి. క్రీడలు, మీడియా, వ్యాపార రంగాలలో ఉన్న అనుభవంతో ఆర్సీబీని ప్రపంచస్థాయిలో నెంబర్ వన్ గా నిలబెట్టాలని ప్లాన్ చేస్తున్నారు. ఆర్సీబీ ఎదుగుదలలో భాగస్వామి కావడం తన అదృష్టమని ఆర్యమన్ బిర్లా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలియజేశాడు.

## రియాన్ పరాగ్‌కి రాజస్థాన్ రాయల్స్ బిగ్ షాక్.. కొత్త కెప్టెన్‌గా అతడే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. 2026, మార్చి 24న ఈ జట్టు కొత్త యాజమాన్యం చేతిలోకి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు మనోజ్ బదేలే నేతృత్వంలో ఉన్న ఈ ఫ్రాంచైజీని, కల్ సోమాని ఆధ్వర్యంలోని కన్సార్టియం కొనుగోలు చేసింది. గతంలో సుమారు రూ. 320 కోట్లకు కొనుగోలు చేసిన ఈ జట్టు, ఇప్పుడు ఏకంగా రూ. 15,280 కోట్లకు అమ్ముడైంది. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన లావాదేవీలలో ఒకటిగా నిలిచింది.

**పూర్తి స్థాయి కెప్టెన్‌గా:**
యాజమాన్యంతో పాటు రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ కూడా మారారు. గత సీజన్ వరకు కెప్టెన్‌గా ఉన్న సంజూ శాంసన్, ట్రేడింగ్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ కు వెళ్లడంతో.. రాజస్థాన్ యాజమాన్యం రియాన్ పరాగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. పరాగ్ గత సీజన్‌లో శాంసన్ అందుబాటులో లేనప్పుడు వైస్ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించాడు. ఈసారి పూర్తి స్థాయి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు.

**జైస్వాల్ కి కెప్టెన్సీ పగ్గాలు:**
సోషల్ మీడియాలో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్‌ను తొలగించి, యశస్వి జైస్వాల్‌ను నియమించనున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. కానీ ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు.. రాజస్థాన్ ఫ్రాంచైజీ కెప్టెన్సీ మార్పు గురించి ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. 2026, మార్చి 25 ముంబైలో జరిగిన ఐపీఎల్ కెప్టెన్ల ఫోటోషూట్‌లో కూడా రియాన్ పరాగ్ పాల్గొని, ట్రోఫీతో ఫోటోలకు ఫోజులిచ్చారు. అయితే జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ స్టార్ ప్లేయర్, భవిష్యత్తులో కెప్టెన్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి మాత్రం పరాగ్ కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రాజస్థాన్ ఫ్రాంచైజీ జైస్వాల్‌ను రూ. 18 కోట్లకు, పరాగ్‌ను రూ14 కోట్లకు రిటైన్ చేసుకుంది.

**రాజస్థాన్ రాయల్స్ షెడ్యూల్:**
రియాన్ పరాగ్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ తమ ఐపీఎల్ 2026 ప్రయాణాన్ని మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. అనంతరం ఏప్రిల్ 4, 7, 10 తేదీలలో వరుసగా గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లతో తలపడనుంది.

# సీనియర్ హీరోల యంగ్ స్ట్రాటజీ!

టాలీవుడ్ లో ఇప్పుడు ఒక సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. ఒకప్పుడు సీనియర్ హీరోలు కేవలం అనుభవజ్ఞులైన దర్శకులతోనే పనిచేయడానికి మొగ్గు చూపేవారు. కానీ మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తమను తాము కొత్తగా ఆవిష్కరించుకోవడానికి సీనియర్ స్టార్లు యంగ్ డైరెక్టర్ల వైపు చూస్తున్నారు. ఈ యంగ్ స్ట్రాటజీ టాలీవుడ్‌లో సరికొత్త రికార్డులకు పునాది వేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి ఈ విషయంలో ముందు వరుసలో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతో 400 కోట్ల వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటారు. తాజాగా చిరంజీవి దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ కల్ట్ చిత్రం చేయడానికి రెడీ అవుతున్నారు. దర్శకుడిగా శ్రీకాంత్ కు ఇది మూడవ చిత్రం మాత్రమే. అయినా అన్నయ్య ఎక్కడా వెనక్కి తగ్గలేదు. తన మార్క్ హిట్ ఇస్తాడు? అనే నమ్మకంతో ముందుకెళ్తున్నారు. ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిచడం అన్కనది మరో ఎత్తు. ఈ ఛాన్స్ తో చిరంజీవి కుర్ర హీరోలకు ఏమాత్రం తీసిపోని ఎనర్జీతో మరో సినిమా చేస్తున్నారని క్లారిటీ వచ్చేసింది. అలాగే నటసింహ నందమూరి బాలకృష్ణ కూడా పంథా మార్చుకున్నారు. వరుస హిట్లతో దూసుకుపోతున్న బాలయ్య తన 112వ సినిమా కోసం సరిపోదా శనివారం ఫేమ్ వివేక్ ఆత్రేయకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది.క్లాస్ కథలు రాసే వివేక్ ఆత్రేయ బాలయ్య కోసం ఓ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ క్రేజీ కాంబినేషన్ 2027 సమ్మర్ కానుకగా విడుదలయ్యే అవకాశం ఉంది. బాలయ్య మాస్ ఇమేజ్‌కు వివేక్ ఇంటెలిజెంట్ స్క్రీన్‌ప్లే తోడైతే బాక్సాఫీస్ వద్ద జాతరే. అక్కినేని నాగార్జున తొలి నుంచి కొత్త దర్శకులను ప్రోత్సహించడంలో ముందుంటారు. తాజాగా తన ప్రతిష్టాత్మక 100వ సినిమా బాధ్యతలను కోలీవుడ్ యంగ్ డైరెక్టర్ కార్తీక్ తంగవేలుకు అప్పగించిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా కార్తీక్ కి పెద్దగా అనుభవం లేదు. తొలి సినిమా కూడా భారీ విజయం సాధించింది లేదు.



**కర్లీ హెయిర్ మోడ్ ఆన్: ప్రకృతి పావని ఆత్మవిశ్వాసం & ఆకట్టుకునే అవతార్**



కానీ నాగ్, కార్తీక్ కథను, మేకింగ్ ను నమ్మి ముందుకెళ్తున్నారు. ల్యాండ్ మార్క్ చిత్రాన్నే కార్తీక్ చేతుల్లో పెట్టారంటే యంగ్ మేకర్ ని కింగ్ ఎంతగా నమ్ముతున్నారు? అన్నది అద్దం పడుతుంది. నాగ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయే చిత్రమవుతుందని అభిమానులంతా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. విక్టరీ వెంకటేష్ కూడా ఈ యంగ్ డైరెక్టర్ల రేసులో వెనుకబడలేదు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఆదర్శ కుటుంబం పూర్తి చేసిన వెంటనే తన ఫేవరెట్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో మరోసారి చేతులు కలపనున్నారు. ఈ చిత్రంలో నందమూరి కళ్యాణ్ రామ్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం.దగుబాటి – నందమూరి హీరోలను ఒకే తెరపై చూపించడం అనీల్ కు ఇదే తొలిసారి. 2027 సంక్రాంతికి ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌ను అందించబోతున్నారు. మొత్తానికి టాలీవుడ్ సీనియర్ హీరోలు తమ అనుభవాన్ని యంగ్ డైరెక్టర్ల కొత్త ఆలోచనలతో జోడించి బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఈ మార్పు కేవలం వసూళ్లకే కాకుండా తెలుగు సినిమా పరిధిని పెంచడానికి కూడా దోహదపడుతోంది.

**బ్రౌన్ శాటిన్ గౌనులో ప్రణీత సుభాష్ టైమ్‌లెస్ గాంభీర్యాన్ని అందిస్తోంది**



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965